ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి





# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY








మంగళవారం 18 ఆగస్టు 2026 | Tuesday 18 August 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 129 | Vol.No 28 Issue No .129 | www.visionandhra.in


### ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి
## అత్యంత ప్రాధాన్యం

- ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తీసుకొచ్చాం
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ స్పష్టీకరణ




హైదరాబాద్,ఆగస్ట్17 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను,

మిగతా 2లో..

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల




హైదరాబాద్,ఆగస్ట్17 : తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే

మిగతా 2లో..

# అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్



- లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్‌కు వేల కోట్ల నిధులు
- 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి తెస్తాం
- 2027 డిసెంబర్ 9 నాటికి ఆసుపత్రుల నిర్మాణం పూర్తి
- కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ
- సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సాహకాలు
- గత ప్రభుత్వం ఆసుపత్రుల నిర్మాణాన్ని పట్టించుకోలేదు
- అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మరు
- పేదల వైద్యానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్,ఆగస్ట్17 :సనత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొనగా, ఈయనతో సీఎం రేవంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేయించి ఆస్పత్రిని జాతికి అంకితం చేశారు. హైదరాబాద్ ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సుమారు రూ. 1,126 కోట్ల భారీ వ్యయంతో ప్రభుత్వం నిర్మించింది.

ప్రారంభ దశలో భాగంగా ప్రతిరోజూ సుమారు 300 మంది రోగులకు ఓపి సేవలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. : తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారి కోసం 300 ఐసీయూ బెడ్లు కేటాయించారు. అత్యవసర , సంక్లిష్ట శస్త్రచికిత్సల కోసం 31 మేజర్ ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. వైద్యరంగంలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ,



దేశంలోనే తొలిసారిగా ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో 'ఏఐ న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్'ను ప్రవేశపెట్టడం ఈ ఆస్పత్రి ప్రత్యేకత. ఈ సాంకేతికత ద్వారా రోగుల రక్త నమూనాలు, నివేదికలు, అత్యవసర మందులను ఆస్పత్రిలోని ఒక విభాగం నుంచి మరొక విభాగానికి క్షణాల వ్యవధిలో వేగంగా సరఫరా చేయడానికి వీలవుతుంది. నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా కార్మిక, మధ్యతరగతి వర్గాలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడంలో సనత్‌నగర్ టిమ్స్ కీలక పాత్ర పోషించనుంది. సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి

మిగతా 2లో..

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

- అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది
- అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం
- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం
- టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి
- ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- మీడియా సమావేశంలో రెవెన్యూమంత్రి పొంగులేటి వివరణ

మిగతా 2లో..




## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

### - జాబ్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి వివేక్




మెదక్,ఆగస్ట్17 : దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ

మిగతా 2లో..

## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

- ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా
- సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది
- సీఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు
- పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం
- మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం



హైదరాబాద్,ఆగస్ట్17 : రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్,

మిగతా 2లో..



## కళ్యాణ,షాదీముబారక్ కొనసాగుతుంది

- గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు
- అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి
- దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం
- ధర్నాలు చేసే వారు పథకంలోని తప్పిదాలపై మాట్లాడాలి
- మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

హైదరాబాద్,ఆగస్ట్17 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మీ పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన

మిగతా 2లో..

## జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

- 2 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్17 : జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక

మిగతా 2లో..

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

- నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే
- డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు
- ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు
- ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్
- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం



అమరావతి, ఆగస్టు 17 : మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు.

మిగతా 2లో..

## అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ

- డిఎస్సీ అంటే అర్థం తెలియని వారి అర్థరహితీ విమర్శలు
- 148 రోజుల్లోనే డీఎస్సీ ఉద్యోగాల భర్తీ పక్రియ పూర్తిచేశాం
- ఇక నుంచి ఏటా ఉపాధ్యాయ నియామకాలు
- అసెంబ్లీలో డిఎస్సీపై నిర్వహణపై మంత్రి లోకేశ్ వివరణ



అమరావతి,ఆగస్ట్17 : డీఎస్సీ నిర్వహణ అత్యతం పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డిఎస్సీ అంటే తెలియని వారు, ఐదేళ్లు అధికారంలో ఉండగా నిర్వహించని వారు డిఎస్సీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సోమవారం నాడు అసెంబ్లీలో డిఎస్సీపై మంత్రి వివరణ ఇచ్చారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. మెగా డీఎస్సీ-2025పై అసెంబ్లీలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించామని పేర్కొన్నారు.'ఏటా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాం. మొత్తం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో తెదేపా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలు చేసింది. టీచర్ల నియామకాలు, బదిలీలు పారదర్శకంగా

మిగతా 2లో..

## ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

భద్రతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన 'ఆహా-ఔషా' సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల పక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ,షాదీముబారక్ కొనసాగుతుంది

పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

## అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్



రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా టిమ్స్ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేటు వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు టిమ్స్‌ను ప్రారంభించామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరోగ్యశ్రీ కోసం రూ.2,700 కోట్లు, సీఎంఆర్ఎఫ్ కోసం రూ.2,526 కోట్లు ఖర్చు చేశామని, మొత్తంగా రూ.5,226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం వెచ్చించామని తెలిపారు. రెండేళ్లలో వైద్య, ఆరోగ్య శాఖకు రూ.21,800 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సనత్‌నగర్‌తో పాటు ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని సీఎం తెలిపారు. ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలో 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయని, 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఒక్కో ఆసుపత్రికి డైరెక్టర్‌ను నియమించి కార్పొరేట్ తరహాలో నిర్వహణ చేపడతామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనపు సమయం కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగుల వెంట వచ్చే అటెండెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ ఉస్మానియా సహా పలు ఆసుపత్రుల నిర్మాణాన్ని పూర్తి చేయలేదని సీఎం విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రి పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ నేతలు టిమ్స్ నిర్మాణంపై చేస్తున్న ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మరని అన్నారు. పేదలకు వైద్యం అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

హైదరాబాద్,ఆగస్ట్17 : ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

## అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహణ

ఉండాలని సీఎం భావించారు. మా ప్రభుత్వం టీచర్లను సింగపూర్, ఫిన్‌లాండ్‌లకు పంపింది. గతంలో వైకాపా ప్రభుత్వం టీచర్లను మద్యం దుకాణాల ముందు నిలబెట్టింది' అని మంత్రి లోకేశ్ అన్నారు. మంత్రి లోకేశ్.. మాట్లాడుతూ ఇక నుంచి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. డీఎస్సీ నియామకాలపై ప్రతిపక్ష పార్టీకి తాను సమాధానం ఇవ్వడం లేదన్న మంత్రి.. డీఎస్సీని ఎలా నిర్వహించాం, ఎలాంటి నిబంధనలు పాటించి నియామకాలు చేపట్టామో రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సి ఉందన్నారు. అందుకే.. మెగా డీఎస్సీపై ఉన్న నిజాలు తెలియజేస్తూ ఆ సమాచారాన్ని సభ్యులకు పుస్తక రూపంలో పంపామని మంత్రి లోకేశ్ తెలిపారు.'కూటమి ప్రభుత్వం డీఎస్సీని బాధ్యతగా భావించింది. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాం. ఈ పోస్టులకు 3,36,300 మంది అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్నారు. 148 రోజుల్లోనే డీఎస్సీ ఉద్యోగాల భర్తీ పక్రియ పూర్తిచేశాం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో సంస్కరణలు పాఠశాలల్లో తీసుకువచ్చాం. టీచర్ రిక్రూట్‌మెంట్ చేయకుండా పాఠశాలలు అభివృద్ధి చెందవు. మహిళలకు డీఎస్సీలో 33శాతం రిజర్వేషన్ తీసుకువచ్చాం. తెలుగుదేశం పార్టీ హయాంలోనే లక్షా 80వేల మంది టీచర్లను నియమించాం.' అని మంత్రి లోకేశ్ తెలిపారు. '2019 నుంచి 24 వరకూ ఒక్క టీచర్ ఉద్యోగ నియామకం కూడా జరగలేదు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం.. టీచర్లను ట్రైనింగ్ కోసం సింగపూర్, ఫిన్లాండ్ పంపితే.. వైసీపీ హయంలో మద్యం షాపుల ముందు కాపలా పెట్టారు.' అని గత ప్రభుత్వ విధానాలను మంత్రి లోకేశ్ ఎండగట్టారు. 'డీఎస్సీ కోసం 42వేల ప్రశ్నలు తయారు చేశాం. డీఎస్సీకి ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు ఇచ్చాం. నియామకాలపై అనేక స్థాయిల్లో వచ్చిన గ్రీవెన్స్‌ను పరిష్కరించాం. భిన్నాభిప్రాయాలతో 336 కేసులు నమోదు చేశారు. డీఎస్సీ పరీక్షను టీసీఎస్ ఐయాన్ ఎ÷-లాట్ ఫాం ద్వారా నిర్వహించాం. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను డిస్ట్రిక్ట్ యూనిట్‌గా చేశాం. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లతో నియామకాలు చేపట్టాం. టీచర్ క్వాలిఫికేషన్‌లో టెట్ మ్యాండేటరీ చేశాం. టీసీఎస్ ఐయాన్ ద్వారా నోటిఫికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించాం. ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసి, ఉపకులాలను గ్రూప్‌లో సెట్ చేసిన తరువాతే డీఎస్సీ నిర్వహించాం. గతంలో 29 స్పోర్ట్స్ కేటగిరీలు ఉంటే.. 65 స్పోర్ట్స్ కేటగిరీలకు పెంచాం. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే స్పోర్ట్స్ కోటా పెంచాం.' అని మంత్రి లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. 'కొందరికి డీఎస్సీ అంటే అర్థం కూడా తెలియదు. వాళ్లే పేపర్ లీక్ అని మాట్లాడుతున్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పక్కాగా జరిగాకే ఉద్యోగాలిచ్చాం. ఏడాది తర్వాత డీఎస్సీలో అక్రమాలంటూ వైసీపీ ఆరోపిస్తోంది. మీ ఆరోపణలకు ఆధారాలు చూపండి. డీఎస్సీపై టీమ్ 11వి అనవసర ఆరోపణలు' అంటూ మంత్రి లోకేశ్ కొట్టిపారేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ఉంది. వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చు. భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టుల్లో 336 కేసులు దాఖలు చేశారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు స్పష్టంగా చెప్పింది. డీఎస్సీలో ఇలాంటి రిజర్వేషన్ అమలు దేశ చరిత్రలోనే తొలిసారి. పారదర్శకంగా మేం నియామకాలు చేపట్టాం. అందుకే వేల మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందగా బయటకు వచ్చి ప్రభుత్వానికి అండగా నిలిచారు ' అని లోకేశ్ అన్నారు. డీఎస్సీపై జగన్ టీమ్ 11 అనవసర ఆరోపణలు చేస్తోంది. కులం, మతం పేరుతో వైకాపా రాష్ట్రంలో చిచ్చు పెడుతోంది. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు సభకు రాలేదు. జగన్ అనే వ్యక్తి అంబేడ్కర్ రాజ్యాంగాన్నే ప్రశ్నిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు తీసుకువచ్చారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నాం. ప్రెస్‌మీట్లు ఎందుకు.. జగన్ సభకు ఎందుకు రాలేదు. తేదీ, సమయం ఖరారు చేయండి.. చర్చకు నేను సిద్ధం. సభలోపలనైనా.. వెలుపలనైనా.. ఎక్కడైనా నేను సిద్ధం. నేనేమీ పారిపోవట్లేదు.. మీలాగా నాపై సీబీఐ కేసులు లేవు.. బెయిల్‌పై లేను. సభకు వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నా' అని లోకేశ్ అన్నారు.

## డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.

డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే

"గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటీనీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో ,90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, ప్రతిభను కించ పరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారు"అని ముఖ్యమంత్రి అన్నారు.

అసెంబ్లీకి రాకుండా పబ్జీలు"

మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నాను. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారనే వాళ్లు రావటం లేదు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నాను. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబు దారీతనంతో నియామకాలు జరిగాయి. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తాం. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి డిమాండ్ చేయాలి. రెండున్నర ఏళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం నా జీవితంలో ఇదే తొలిసారి. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజస్ తీసుకుంటున్నారు. అనే నేనుగా నాకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉంది. వారికి ఏముందో ప్రజలే చెప్పాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

# రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

- **565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ**
- **మొత్తం 5,410 వినతుల స్వీకరణ ..10,753 మంది అధికారుల హాజరు**
- **జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి**
- **ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి వెల్లడి**

హైదరాబాద్,ఆగస్ట్17 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్క్ లు, హెల్ప్ డెస్క్ ను, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించబడ్డాయి. అలాగే, ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి. మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార పక్రియను ప్రజలకు మరింత చేరువ చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానిక స్థాయిలోనే సంబంధిత అధికారులకు తమ సమస్యలను వివరించే అవకాశం మండల స్థాయి ప్రజావాణి ద్వారా లభించింది. ÷-రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి, అధికారుల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించగా, అధికారులు కూడా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడి, 5,410 వినతులు స్వీకరించబడ్డాయి. ప్రజలు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమిషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టిన వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు .

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్డ్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు. వారి కోసం రూ.25 లక్షల జీతం ఎదురుచూస్తోందని తెలిపారు. వీసా ఖర్చులను కూడా సగం వరకూ ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. విదేశాలకు వెళ్తే ఎన్నో కుటుంబాలు బాగుపడతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి !

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హోర్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్రో తదితర ఉత్పత్తులపైనా అన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడు తోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో-గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్సఎ÷-లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు-గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో-గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్-సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

## దేవాలయ, పార్కు స్థలాల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

### కబ్జాదారులను పార్టీల నుంచి సస్పెండ్ చేయాలి
### ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు
### తిరుమల మెడోస్ లో కబ్జా స్థలాలను పరిశీలించిన ఫెడరేషన్ బృందం



బోడుప్పల్,ఆగస్ట్17విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని తిరుమల మెడోస్ కాలనీలోని సర్వే నంబర్ 215లో గల పార్కు, గుండి పోచమ్మ దేవాలయ స్థలాలపై అక్రమ కబ్జాలు, రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు డిమాండ్ చేశారు. కబ్జాలకు పాల్పడిన వారు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఆదివారంతిరుమల మెడోస్ కాలనీలో ఫెడరేషన్ బృందంతో కలిసి సర్వే నంబర్ 215లోని స్థలాలను ఆయన పరిశీలించారు. పార్కు, దేవాలయానికి కేటాయించిన స్థలాలను కబ్జా చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మేడిశెట్టి వెంకటేశ్వర్, ఏ. శ్రీనివాస్ గుప్తా వారి బంధువులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. స్థలాల అసలు స్వరూపం, కేటాయింపులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నిజానిజాలు వెలుగులోకి తేవాలని అధికారులను కోరారు.ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన పార్కు, దేవాలయ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాపోలు రాములు అన్నారు. కబ్జాలకు సంబంధించి అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు స్థలాలను తిరిగి ప్రజా ప్రయోజనాలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఏడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి,కోశాధికారి శ్రీనివాస్‌గుప్తా,మీడియా కన్వీనర్ మధుసూదన్,వెంకటస్వామి,ఎర్ర యాదగిరి,కాలనీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కాలనీవాసులు కుమారస్వామి, శివశంకర్, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ జరపాసర్వే నంబర్ 215లోని పార్కు, దేవాలయ స్థలాలను కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మేడిశెట్టి వెంకటేశ్వర్, ఏ. శ్రీనివాస్ గుప్తా, వారి బంధువులపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి అసలు స్వరూపం ఏమిటి, ఎవరికి కేటాయించబడింది, ఏ ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగాయి అనే అంశాలను రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ అధికారులు రికార్డుల ఆధారంగా పరిశీలించి వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలి.

## గుంతల రహదారి పొంచి ఉన్న ప్రమాదము. పట్టించుకోని అధికారులు



నారాయణపేట, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) మాగనూరు మండలంలోని బిటి రహదారులు గుంతలు గుంతలుగా ఏర్పడి ప్రమాదాలకు నిలయముగా మారుతుందని మశీదిపల్లి గ్రామ సర్పంచ్ రాఘవరెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అడవి సత్యారం గ్రామం దగ్గర గల పెద్ద వాగు నుంచి ప్రతిరోజు రాత్రి, పగలు,ఇసుక టిప్పర్లు అధిక లోడుతో అతి వేగంగా వెళ్లడం వల్ల బిటి రహదారులు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని యా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా 167 వ జాతీయ రహదారి వడ్వాటు గేటు నుంచి వడ్వా టు, అడవి సత్కారం, కొల్పూరు, మంది పల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా గుంతలు గుంతలు గా ఏర్పడి ధ్వంసమైనాయని అన్నారు. ఈ రహదారి గుండా అత్యవసర వైద్యం కోసం వెళ్లాలన్న మధ్యలోనే ప్రాణాలు పోయే పరిస్థితి ఉ ందన్నారు.ప్రతిరోజు 50 ,60,సంఖ్యలో టిప్పర్లు ఇసుక లోడుతో వెళ్లడం వల్ల రహదారి పూర్తిగా ధ్వంస మౌతుంది ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వర్షాకాలం వర్షాలు కురవడం వల్ల రహదారి పై ఎదురు ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే ఈ యొక్క రోడ్డు పై పక్కకు వాహనాలను తీసుకోవాలన్న చాలా ఇబ్బందిగా ఉందన్నారు.ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్న, కాలినడకన వెళ్లాలన్న ఎదురుగా వచ్చే టిప్పర్ల స్పీడు నుంచి ఏ ప్రమాదం ఎప్పుడు జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామన్నారు. రోడ్డుపై గుంతలు గుంతలుగా ఏర్పడడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## విలేకరి దంపతులపై కాంగ్రెస్ నాయకుల దాడి

### మాపై వార్తలు రాస్తావా అంటూ విలేకర్ దంపుతుల పై దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో చనిపోయడు అనుకొని వదిలేసి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు




భూపాలపల్లి జిల్లా 17 జూలై (విజన్ ఆంధ్ర)వివరాల్లోకి వెళ్తే:- తమపై తమ భూములపై వార్తలు రాస్తావా అంటూ ఆదివారం సుమారు రాత్రి 10 గంటల సమయంలో కొందరు వ్యక్తులు తమ ఇంటికి వచ్చి తలపు కొట్టడంతో ఎవరా అని తలుపు తీసిన వెంటనే సుమారు 5 మంది వ్యక్తులు విచక్షణ రహితగా దంపతులపై దాడి చేసిన ఘటన చిట్యాల మండలం కేంద్రంలో జరిగింది భూపాలపల్లి నియోజకవర్గ చిట్యాల మండల కేంద్రంలో ఆర్.బి న్యూస్ లో రిపోర్టర్ గా పనిచేస్తున్న పుల్ల రవీందర్ ఒక రైతు వార్తలు కవరేజ్ కోసం పిలవడం జరిగింది కవరేజ్ చేసిన తర్వాత నేను టెలికాస్ట్ చేసి నేను గ్రూపులో వేయగా గ్రూపులలో వేయడం జరిగింది. బాధితుడు పుల్ల రవీందర్ మాట్లాడుతూ :-- మధు వంశీరావు, ముఖిరాల నటరాజు, నా మీద కక్షలు పెంచుకొని సుమారు రాత్రి 10: సుమారు నా ఇంటి డోర్లు కొట్టగా నేను ఇంటూ డోర్లు ఎవరు మీరు అని అడగనా నేనే అనగా సరే అని వెంటనే డోర్లు తీయగా నామీద లోపలికి వచ్చి విపరీతాముగా నన్ను మెడ పీస్కి నాన్ స్టాప్ గా ఎక్కడ పడితే అక్కడ కొట్టడంతో కూర్చొని కింద పడడంతో నా భార్యను కూడా విపరీతంగా కొట్టారు ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్ టీవీ ఇతర సామాన్లు పగలగొట్టి కింద పడవేశారు. కొట్టిన వారిలో ముఖిరాల మధు వంశీకృష్ణ రావు ఆయనే జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ వేణు, కాంగ్రెస్ పార్టీ, నటరాజ్ కాంగ్రెస్ పార్టీ వీలు నా భార్య అనేది కళావతి అరవగా ఆమెను కూడా దాడి చేసి ఆమెను ఆమె గొంతు నొప్పి నోరు నొక్కి విపరీతంగా కొట్టడం జరిగింది . నేను చచ్చిపోయాను అనుకోని వెళ్ళిపోయినారు అయ్యా ఎస్పీ గారు వీరి మీద మీద కఠినమైన చర్యలు తీసుకోవాలని నేను వేడుకుంటున్నా అన్నారు.

## మద్దూర్ లోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి17 ఆగస్టు కస్తూరిబా గాంధీ బాలికలను ప్రతి క్షణం గమనిస్తూ, తరచూ పర్యవేక్షణ చేస్తూ ఆరోగ్యం మెరుగయ్యేంత వరకు మంచి వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి డాక్టర్లను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ చేర్యాల పట్టణంలోని సామాజిక ఆసుపత్రిని సందర్శించి ఈనెల 16వ తేదీ ఆదివారం రోజున మద్దూరు మండలం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను పరామర్శించి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూకస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగిన సంఘటనవిచారకరమైనదని, బాలికల ఆరోగ్యం మెరుగయ్యేంత వరకు మంచవైద్యంఅందించాలనిడాక్టర్లనుఆదేశించారు.ధైర్యంగా ఉండాలని, డాక్టర్లు సూచించిన విధంగా మెడిసిన్, ఆహారం తీసుకోవాలని, భయం మన దరిదాపుల్లో రాకూడదని మీకు మంచి వైద్యం అందిస్తామని విద్యార్థులకు భరోసా కల్పించారు.మీ విద్యాలయాన్ని ఇప్పుడే పర్యవేక్షణ చేసి వస్తున్నానని చదువు, ఆరోగ్యం, వసతి విషయంలో ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని, బాలికలకు ఆరోగ్యం నిలకడగా ఉందని ఆరోగ్యం మెరుగయ్యేంత వరకు మంచి వైద్యం అందిస్తామని ఎలాంటి ఆందోళన చెందవద్దని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

## రాజ్యాంగ విలువలను కాపాడాలి

**-హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ ఆగ్రహం.**
**-హల్ద్వానీ ఘటనపై నారాయణపేటలో కాంగ్రెస్ సత్యాగ్రహం.**
**- కుల వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన కాంగ్రెస్.**
**- ఖర్గే కు జరిగిన అవమానంపై నారాయణపేటలో మహాధర్నా.**
**- హల్ద్వానీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి**
**- పేట డిసిసి జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి**



నారాయణపేట ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) ఉత్తరఖాండ్ రాష్ట్రంలోని హల్ద్వానీ లో జరిగిన కులావివక్ష ఘటనకు నిరసనగా ఏఐసీసీ మరియు టిపిసిసి కమిటీ పిలుపు మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ మహాధర్నా నిర్వహించారు.సీవీఆర్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభ అనంతరం జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. ప్రజా సభ జరిగిన ప్రదేశాన్ని 'శుద్ధీకరణ' పేరుతో బిజెపి పార్టీ కి చెందిన కొందరు సానుభూతి పరులు గంగాజాలం తో శుభ్రం చేయడం కుల వివక్షకు సంబంధించిన ఆలోచనలకు తావిచ్చే చర్యగా కనిపిస్తోందన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా ఒక వ్యక్తి కులం ఆధారంగా అతని గౌరవాన్ని కించపరిచే చర్యలు జరగడం బాధాకరమన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం నిషేధించినప్పటికీ ఇలాంటి ఘటనలు బిజెపి పార్టీ ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. మల్లికార్జున్ ఖర్గే కి జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి జరిగిన అవమానం కాదని,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ జరిగిన అవమానమని అన్నారు. ఈ ఘటనకు బీజేపీకి చెందిన కొందరు సానుభూతిపరుల ప్రమేయం ఉందని దీనిపై బీజేపీ నాయకత్వం ఘటనను బహిరంగంగా ఖండించి,సమగ్ర విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు ఎవరి మద్దతు ఉన్నా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఘటనకు బాధ్యులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సత్యాగ్రహ దీక్షను జిల్లా కేంద్రానికే పరిమితం చేయకుండా ప్రతి మండలం,ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి ఈ ఘటన ను ఖండించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది**

ముసాయిదా ఓటర్ల జాబితా వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరారు. బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఎల్ఏలు ఒక్కరే అన్నీ చేయలేరని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఇందులో భాగస్వామి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట,కోస్గి, మక్తల్ మార్కెట్ చైర్మన్ లు శివారెడ్డి,భీములు,రాధ లక్ష్మరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,జిల్లా అధికార ప్రతినిధి సంతోష్,క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల శివకుమార్,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య,మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్,అనంద్, విజ్జప్ప గౌడ్,సూర్య ప్రకాష్ రెడ్డి,శివరాంరెడ్డి,బాలయ్య,మాజీ మార్కెట్ చైర్మన్ లుబండి. వేణుగోపాల్,సుధాకర్,ఎండి. గౌస్,నరహరి,వైస్ చైర్మన్ కె. హన్మంతు,బోయ. శరణప్ప,పళ్ళ అనిల్,పిఏసిఎస్ చైర్మన్ ఈదప్ప,నిరంజన్ రెడ్డి కౌన్సిలర్లు రాజేష్ ఘూట్, కుర్వ మనోజ్,శంకర్,ఉగ్గు రాజు,ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ జిల్లా అధ్యక్షులు కోట్ల.మధుసూదన్ రెడ్డి,యూత్ మండల అధ్యక్షులు మహేష్, సర్ఫరాజ్, వేణు గౌడ్,అఖిల్ రెడ్డి,యస్సి సెల్ మండల అధ్యక్షులు చంద్రయ్య,శ్రీను,చందర్, రాజేష్,రాములు తదితరులు పాల్గొన్నారు

## లింగాపూర్ ఎంపీడీవో పర్యవేక్షణలో ప్రజావాణి



లింగాపూర్,ఆగస్టు 17(విజన్ ఆంధ్ర )తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లింగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎంపీడీవో,రాంచందర్ పర్యవేక్షణలో ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేసి పరిష్కరించుకోవచ్చు అని అధికారులు సూచించారు. ప్రజావాణి కోసం చేసిన ఏర్పాట్లపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

### పుట్టలో పాలుపోస్తున్న డిప్యూటీ మేయర్ సల్ల రమ్య



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17,(విజన్ ఆంధ్ర)నాగుల పంచమి పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఎఫ్ సి ఏ గోదాం సమీపంలో గల శ్రీ సప్త శీరస్సు నాగదేవత ఆలయంలో భక్తులు పుట్టలో పలుపొసి, పూజలు చేశారు. ఉదయం నుండి మహిళలు ఆలయంలో బారులు తీరారు. ఆలయ అర్చకులు ఎడ్ల బాలయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ నాగదేవత ఆలయంలో పూజలు చేశారు. పుట్టలో పాలుపొసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం వద్ద నడివెల రాజేశం సరోజ దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లో దొడ్డిపట్ల కృష్ణ, గుంట మల్లేష్,బోరె సురేష్,దబ్బెట శ్రీకాంత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి - షాది ముబాంక్ పథకం ను కొనసాగించాలి

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్ కుమార్
### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17,(విజన్ ఆంధ్ర)కళ్యాణ లక్ష్మి-షాది ముబారక్ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని, కేసీఆర్ పథకాలను నిలిపివేయాలని చుస్తే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులుండవని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నడిపెల్లి విజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి, అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలు మరిచి కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని,గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ లాంటి పథకాన్ని నిలిపివేయడం ప్రయత్నిస్తున్నారని అన్నారు. కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాలను కొనసాగించకపోతే ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ,కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాడుతుందని,సెప్టెంబర్ 9 తారీకు నాడు కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకం పై నమోదైన పిటీషన్ కు, ప్రభుత్వం తరఫున అప్పీల్ చేయాలని, లేని పక్షాన,బిఆర్ఎస్ పార్టీ తరఫున కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల,మంత్రుల, మరియు ముఖ్యమంత్రి ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వచ్చి కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ గురించి మంచిర్యాలలో జరుగుతున్న నిరసనలు కలెక్టర్ గారితో మాట్లాడి ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా కార్యక్రమం ముగించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,మహిళా నాయకురాలు,టీబిజికేఎస్ నాయకులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు,యువజన విభాగం,విద్యార్థి విభాగ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్యపై అవగాహన కల్పించాలి**
**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిది ఆగస్టు-17(విజన్ ఆంధ్ర)విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం సుల్తానాబాద్మండలంలోని ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఐ.ఈ.ఎస్ బాలికల డిగ్రీ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కళాశాలలోని చాంబర్ ఆఫ్ డ్రీమ్స్ ను ప్రారంభించి,డార్మిటరీ, వంటగది, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.విద్యార్థులకు వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్ గైడెన్స్ అందించాలని సూచించారు. ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పీజీ కోర్సులకు సంబంధించిన అవకాశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.కలెక్టరేట్ ద్వారా టాస్క్ సహకారంతో విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్, వి- హబ్ ద్వారా అందిస్తున్న వివిధ కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు అకడమిక్స్తో పాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలను పొందేందుకు నైపుణ్యాలు ఎంతో కీలకమని తెలిపారు. విద్యార్థులు తమ విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు.కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీఓ మణిదీప్తి, కళాశాల ప్రిన్సిపాల్ వనజతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలి

**ఇల్లందు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 18(విజన్ ఆంధ్ర)పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు సీసీటీఎన్ఎస్ 2.0, సీఈఐఆర్, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీసు సిబ్బందికి సూచించారు.సోమవారం ఇల్లందు పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం వివిధ విభాగాల పనితీరును సమీక్షించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సమస్యలతో వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సూచించారు.స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ.. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ వర్టికల్స్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు, విధుల నిర్వహణ తీరును పరిశీలించారు.సీసీటీఎన్ఎస్ 2.0ను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను ప్రజలకు మరింత వేగంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను కూడా సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని తెలిపారు.స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.**సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలి**
సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్-112కు ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ సురేష్, ఎస్సైలు ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాత కక్షలతో యువకున్ని పొడిచి పారిపోయిన వ్యక్తి

**ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షిస్తామని అన్నారు. ఎస్సై మహేందర్ కుమార్**



భూపాలపల్లి జిల్లా 17 ఆగస్టు (విజన్ ఆంధ్ర)మల్హర్ రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన నమస్తే మంతెన నవీన్ తండ్రి లింగయ్య అనే వ్యక్తిని పాత కక్షలు ఉన్నందున బీరు బాటిల్ తో పొడిచి పరారైన పులిగంటి సంతోష్. వివరాల్లోకి వెళ్తే ఆదివారం రోజున దుకాణానికి వెళ్లి పెరుగు తీసుకొని వెళ్దాం అనుకున్న సమయంలో అక్కడికి హఠాత్తుగా పులి గంటి సంతోష్ అనే వ్యక్తి బీరు బాటలతో పొడిచి చంపడానికి ప్రయత్నించాడు ఈ క్రమంలో మరో వ్యక్తి ఆ ప్రయత్నాన్ని ఆపడానికి ప్రయత్నించిన విదిలించుకొని నన్ను పొడిచారు అంటూ మంతెన నవీన్ వ్యక్తి ఆరోపించారు. పొడిచిన వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ ప్రాథమిక చికిత్సచేసి అక్కడి నుంచి డాక్టర్ల సిఫారసు మేరకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 100 పడుకల ఆసుపత్రికి తరలించగా ఆస్పత్రి సూపర్డెంట్ పేషెంట్ ని చూసి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసిన తర్వాత పూర్తి చికిత్స చేస్తాము తెలియజేస్తామన్నారు. కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్ వివరణ త్వరగా ఇంకా మాకు పిటిషన్ రాలేదని వచ్చిన వెంటనే విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షిస్తామని అన్నారు.


## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17,(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కేంద్రం లోని జనకాపూర్ కు చెందిన సొన్నాయిల మానస తనకు దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం అంకుషాపూర్ కు చెందిన సోగాల కోమల్ తనకు జనకాపూర్ శివారులో గల పట్టా భూమిని కొలతలు నిర్వహించి హద్దులు నిర్ధారించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం పర్సానంబాల గ్రామానికి చెందిన దుర్గం హనుమంతు తాను సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ పట్టణానికి చెందిన కాంపెల్లి రవీందర్ తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎస్. భాస్కర్ రావు తనకు దహేగాం మండలం లగ్గాం గ్రామ శివారులో గల భూములకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్ తాను సర్పంచ్ గా పనిచేసిన కాలం పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన సయ్యద్ జుబేర్ తనకు దివ్యంగా పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నేటి నుండి నిర్వహించడం జరుగుతుందని, అర్జీదరులు తమ సమస్యలపై మండల స్థాయిలో దరఖాస్తు చేసినట్లయితే అక్కడే పరిష్కరించడం జరుగుతుందని, అక్కడ పరిష్కారం కానట్లయితే జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## స్వయం భూ శంభులింగేశ్వర స్వామికి వెండి నాగపడగ బహూకరణ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి(కొండపాక ) ఆగస్టు 17:మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్కు చెందిన భక్తుడు మండల కవిత జ్ఞానేశ్వర్ దంపతులు స్వామివారికి 134 గ్రాముల బరువు గల వెండి నాగపడగను కానుకగాసమర్పించారు .ఎంతో ప్రాశస్త్యం కలిగిన స్వయంభూశంభులింగేశ్వర స్వామికి పవిత్రమైన నాగుల పంచమి రోజున వెండినాగపడగనుబహూకరించడం పట్ల భక్తులు హర్షంవ్యక్తంచేశారు.స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించిన దాత జ్ఞానేశ్వర్కు ఆలయ పాలక మండలి సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలోఆలయపాలక మండలి అధ్యక్షుడు మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోనె శ్రీనివాస్, నర్ర దేశాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యార్థులకు కేఎల్హెచ్ జీబీఎస్ ఘన స్వాగతం



హైదరాబాద్, ఆగస్ట్ 17 (విజన్ ఆంధ్ర) : కొండాపూర్లోని కేఎల్హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్లో 2026-27 విద్యా సంవత్సరానికి కొత్తగా చేరిన విద్యార్థులకు పరిచయ కార్యక్రమం నిర్వహించినట్లు కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఎర్.కోనేరు లక్ష్మణ్ హవిష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్హెచ్ జీబీఎస్ డీన్ డా. ఆనంద్ బెతపూడి తోకలసి ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఎఎస్ డా.జయప్రకాశ్ నారాయణ్, పాల్గొని విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాలతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీకాంత్ పరికిబండ్ల, వికాస్ సురేంద్రన్, దిలీప్ కుమార్, సాయి దోమ, శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, డా.జె.శ్రీనివాసరావు, డా.ఎం.కిషోర్ బాబు, డా.సూర్య ప్రవీణ్ పాల్గొని విద్యార్థులకు పరిశ్రమలు, వృత్తి అవకాశాలు, నాయకత్వంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు.

## భారత్ గ్యాస్ బంగారు కానుక... హనుమకొండలో 'భారత్ గ్యాస్ లైట్ జిప్ ' ప్రారంభం


**ఇక గ్యాస్ కనెక్షన్ల భారంపై వినియోగదారులకు ఊరట**
**తక్షణ కొత్త కనెక్షన్లు**
**కేవలం 4 గంటల్లోనే ఎక్స్ ప్రెస్ డెలివరీ**
**తక్కువ బరువు, తుప్పు పట్టని సిలిండర్**
**మెరుగైన భద్రత, ఆధునిక రూపకల్పన**



, హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : భారతదేశంలోని ప్రముఖ ఇంధన సంస్థలలో ఒకటైన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సరికొత్త ఒరవడికి నాంది పలికింది. అధిక బరువు ఉండే గ్యాస్ సిలిండర్ మోయడాలు, లేట్ డెలివరీలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే వినియోగదారులకు త్వరగా కొత్త ఎల్.పీ.జీ కనెక్షన్ ను పొందేలా వీలు కల్పించేందుకు తక్షణ కొత్త కనెక్షన్ మరియు సరళీకృత అన్ బోర్డింగ్ ప్రక్రియను తీసుకువచ్చింది. భారతదేశం మొత్తంలో గ్యాస్ కనెక్షన్స్ భారమైన వేళ వినియోగదారుల అవసర నిమిత్తం 'భారత్ గ్యాస్ లైట్ జిప్ ' అనేది బీపీసీఎల్ అందిస్తున్న బంగారు కానుక. దీనికి ఎలాంటి ఓటీపీ మరియు ఎలాంటి బుకింగ్ వెయిటింగ్ పీరియడ్ అవసరం లేదు. తేలికైనటువంటి, పారదర్శకమైన ఆధునాతన సిలిండర్ ను వినియోగదారులకు అందించడానికి 'భారత్ గ్యాస్ లైట్ జిప్ ' ను ప్రీమియం ఎల్పీజీ, అనుభవాన్ని పొందడానికి బీపీసీఎల్ ఆధునిక రూపకల్పనకు ప్రాణం పోసింది. ఈ ఆధునిక రూపకల్పనలో భాగంగానే శనివారం హనుమకొండలోని బాప్టిస్ట్ కాంప్లెక్స్ కారిడార్ లో 'భారత్ గ్యాస్ లైట్ జిప్ ' ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బీపీసీఎల్ సేల్స్ ఆఫీసర్ సాహిల్ పురుషోత్తమ్ దోర్బే, బీపీసీఎల్ టెరిటరీ అండ్ రిటేల్ కో ఆర్డినేటర్ మనీష్ మిట్టల్, ఎల్పీజీ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, డిస్ట్రిబ్యూటర్లు, బందెల కృప అన్వేష్, వలుపదాసు రాంమనోహర్, ఏ.రజిత మరియు వివిధ జిల్లాల డిస్ట్రిబ్యూటర్ల ఆధ్వర్యంలో శనివారం లాంఛనంగా 'భారత్ గ్యాస్ లైట్ జిప్ ' ప్రారంభమైంది. ఈ నూతన ఒరవడిని 100నగరాల్లో ప్రారంభించారు. ఇందులో భాగంగానే భారతదేశంలోని ఇతర ప్రధాన నగరాలకు కూడా విస్తరించేలా చర్యలు చేపట్టారు. అయితే బీపీసీఎల్ తీసుకున్న ఈ నూతన ఒరవడితో ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చి తాత్కాలికంగా జీవనం కొనసాగించే వారికి, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి నిరంతరం భారత్ గ్యాస్ సేవలు తక్షణమే అందించండం సుసాధ్యమవుతుంది.'భారత్ గ్యాస్ లైట్ జిప్ ' అనేది భవిష్యత్తుకు సిద్ధమైన ఎల్పీజీ వ్యవస్థను నిర్మించే తమ ప్రయాణంలో ఇక ముఖ్యమైన అడుగు అని ఉమ్మడి వరంగల్ జిల్లా బీపీసీఎల్ సేల్స్ ఆఫీసర్లు, రిటేల్ అండ్ టెరిటరీ కో ఆర్డినేటర్, డిస్ట్రిబ్యూటర్లు అన్నారు. తక్షణ అన్ బోర్డింగ్ మరియు ఎక్స్ ప్రెస్ డెలివరీ సౌకర్యాన్ని అందించడం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించాలనే తమ నిబద్ధతకు ఈ విధానం నిదర్శనమని అన్నారు. రోజువారి జీవితాన్ని మరింత స్మార్ట్ గా, సులభంగా మరియు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చే ఎల్పీజీ సేవలను అందించే దిశగా ఇది మరో ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సౌకర్యాన్ని వినియోగదారులకు వినియోంచుకోవాలని వారు కోరారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి**



కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 18(విజన్ ఆంధ్ర) ప్రజల నుంచి ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యాచందన, డీఆర్వో పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.మండలాల్లోనూ ప్రజావాణిజిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మండలాల్లో కూడా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## డబ్బులు అడిగితే ఇవ్వకండి



నారాయణపేట, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) నారాయణ పేట జిల్లా రైతులకు సాగునీరు మరియు త్రాగునీరు అందించే మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి వాకిటి శ్రీహరి , నారాయణ పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఈ ప్రాంత జల సాధన సమితి నాయకుల ఉద్యమాలు ,రైతుల పోరాటాలు చూసి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే పూర్తి చేస్తాం అని చెప్పి ప్రస్తుతం పనులు ప్రారంభించారని తెలిపారు.భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్ట పరిహారం ఇవ్వాలని జిల్లాలో రైతుల మేలు కోరుకునే వారు చాలా మంది నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తే మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు శివ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని పోయి ఎకరాకు 20 లక్షల రూపాయలు నష్ట పరిహారం ఇప్పించారని తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం లో భూములు కోల్పోయిన రైతులు ఎవరు అయిన నాయకులు డబ్బులు అడిగితే ఇవ్వకండి అని తెలిపారు.అలా ఎవరు అయిన డబ్బులు అడిగితే వారికి ఎందుకు ఇవ్వాలో ప్రశ్నించాలని కోరారు.రైతుల మేలు కోరుకునే వారు నిస్వార్థంగా పోరాటం చేయాలి అని అన్నారు.

## మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలకు శ్రీకారం

**-పేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక**



నారాయణపేట, ఆగస్టు 17( విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లాలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ కార్య కలాపాలను పారదర్శకంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎం ఈ వో బాలాజీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

## వరి పంట వేసి రైతులు ఇబ్బందులు పడొద్దు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17,(విజన్ ఆంధ్ర)రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి నీటిపారుదల శాఖ ఎస్.ఈ. విష్ణు ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌తో పాటు రానున్న రబీ సీజన్‌లోనూ నీటి లభ్యత విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని మొదటి ప్రాధాన్యతగా త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందని, గొల్లవాగు ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టులలోనూ వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలిపారు. వరి పంటకు ఒక ఎకరాకు అవసరమయ్యే నీటితో సమానమయ్యే నీటిని వినియోగించి సుమారు 3 నుంచి 4 ఎకరాలలో ఆరు తడి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి నాట్లు వేస్తే పంటకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో పంట ఎండిపోయే ప్రమాదం, దిగుబడి తగ్గడం, ధాన్యం నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నీటి కొరత కారణంగా వరి గింజ పరిమాణం తగ్గి, దిగుబడి తగ్గడంతో పాటు పంటను మార్కెట్‌లో విక్రయించడంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంచుకోవాలని, ఈ పంటలకు అవసరమైన మేరకు నీటిని అందించగలిగే అవకాశం ఉన్నందున పంటలు విజయవంతంగా సాగయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన విత్తనాలను కూడా అందించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు తదితర పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తోందని, మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో గరిష్ట మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జూన్ 1వ తేదీ నుంచే రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నామని, అయినప్పటికీ కొంతమంది రైతులు వరి సాగు చేయాలని నిర్ణయిస్తే భవిష్యత్తులో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలమట్టాలు తగ్గిన నేపథ్యంలో బోర్లపై ఆధారపడే రైతులు సైతం నీటి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, రైతులు పరిస్థితులను అంచనా వేసి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత నీటి పరిస్థితులపై రైతులకు వాస్తవ పరిస్థితిని వివరించి, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించడంలో మీడియా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో నీటి లభ్యత, వర్షపాతం విషయంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం అవసరమని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలంటే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవాలని, ప్రస్తుత పరిస్థితులలో వరి సాగు చేసి నీటి కొరతతో పంట నష్టపోయే కంటే మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి పంటలను సాగు చేయడం రైతులకు ప్రయోజనకరమని తెలిపారు. రైతులు నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ, సాగునీటి శాఖల అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

## పేటలో బి. ఆర్. ఎస్ ఆందోళన కార్యక్రమం



నారాయణపేట, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను ఎత్తేయాలని చూస్తుందని తీవ్రంగా ఖండించి నారాయణపేట బి. ఆర్. ఎస్ నాయకులు సోమవారం స్థానిక సత్యనారాయణ చౌరస్తాలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు విజయసాగర్ అధ్యక్షత వహించగా బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమ్మ కోళ్ల శ్రీనివాస్ రెడ్డి ,మాజీ మండల అధ్యక్షులు వేపూరు రాములు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చారని ఇందులో భాగంగా కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను సైతం అమలుచేసి నిరుపేదలకు అందజేశారని దీనిని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తే తగిన గుణపాఠం చెబుతామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. వెంటనే ఈ పథకాలను అమలు చేసి పేద ప్రజలకు అందజేయాలని లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ,7 వ వార్డు కౌన్సిలర్ భరత్, నాయకులు చెన్నారెడ్డి ,కన్నా జగదీష్, సుదర్శన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గురులింగప్ప ,రాజులతోపాటు బి ఆర్ ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు క్లిష్ట చికిత్సలు విజయవంతం

**-థ్రాంబోసైటోపీనియా గర్భిణికి సురక్షిత ప్రసవం..**

**-37 ఏళ్ల మహిళకు హిప్ రీప్లేస్‌మెంట్**

**-ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్**



పెద్దపల్లి జిల్లా ప్రతినిది ఆగస్టు-17(విజన్ ఆంధ్ర)పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సోమవారం రెండు క్లిష్టమైన వైద్య చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. థ్రాంబోసైటోపీనియాతో బాధపడుతున్న 23 ఏళ్ల గర్భిణికి అవసరమైన ప్లేట్‌లెట్లు ఎక్కించి సురక్షితంగా ప్రసవం చేయడంతో పాటు, తీవ్ర ఆస్టియోఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న 37 ఏళ్ల మహిళకు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన 23 ఏళ్ల గర్భిణి గర్భధారణ ప్రారంభం నుంచే జిల్లా ఆసుపత్రిలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు ప్లేట్‌లెట్ కౌంట్ తక్కువగా ఉండి సుమారు 50 వేల వరకు నమోదవుతుండటంతో వైద్యులు ప్రతి నెలా పరీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన చికిత్స, జాగ్రత్తలతో గర్భధారణను పర్యవేక్షించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ సూచనలు, పర్యవేక్షణలో అవసరమైన సమయంలో ప్లేట్‌లెట్లు ఎక్కించి సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అదేవిధంగా ఇందారం గ్రామానికి చెందిన 37 ఏళ్ల మహిళ కొంతకాలంగా తీవ్రమైన ఆస్టియోఆర్థ్రైటిస్ కారణంగా నొప్పి, నడవడంలో ఇబ్బందులతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షల్లో హిప్ జాయింట్‌లో తీవ్రమైన సమస్య ఉన్నట్లు గుర్తించడంతో హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా ఆసుపత్రిలో హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ రెండు చికిత్సల్లో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మేఘన, డాక్టర్ వినయ్ కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ రవళిక, అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. విజయవంతంగా చికిత్సలు నిర్వహించిన వైద్య బృందంతో పాటు ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నవజాత శిశు కేంద్రం, 2డీ ఎకో, ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ తదితర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కె. శ్రీధర్ సూచించారు. వైద్య సేవలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# కాల్వ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలని మంత్రికి వినతి



సిద్దిపేట జిల్లా, 17 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టు – తపస్పల్లి గ్రామానికి చెందిన కాల్వ లబ్ధిదారులకు పరిహారం చెక్కులను త్వరితగతిన అందజేయాలని కోరారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి, స్థానిక రైతులకు నేరుగా చెక్కులను పంపిణీ చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిపై మంత్రి వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందిస్తూ, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందూరి ఐలయ్య తెలిపారు.

# ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం చేయాలి

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు, వైద్యం, కౌన్సెలింగ్‌పై విస్తృత ప్రచారం




రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర బ్యూరో):ఎయిడ్స్ నియంత్రణపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ నుంచి నిర్వహించిన ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం టోల్‌ఫ్రీ నంబర్ 1097, క్యూ ఆర్ కోడ్‌తో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఐడీఓసీ నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్‌స్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా మానేరు వంతెన వరకు కొనసాగి తిరిగి ఐడీఓసీకి చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు, వైద్యం, మందులు, కౌన్సెలింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో పకడ్బందీగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, యువత, విద్యార్థులకు అవగాహన సమావేశాలు, పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు ఎయిడ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి మొండయ్య, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ ఎత్తేసేందుకు కుట్ర

**ఉమ్మడి ఘట్కేసర్ మాజీ జెడ్పిటీసీ,బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి**

**మేడిపల్లి మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద బీఅర్ఎస్ పార్టీ ధర్నా**

**ధర్నాను అడ్డుకున్నేందుకు పోలీసుల ప్రయత్నం**

**బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం**




బోడుప్పల్ ,ఆగస్ట్17(విజన్ ఆంధ్ర) : పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసాని కల్పించేందుకు అమలు అవుతున్న కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని ఉమ్మడి ఘట్కేసర్ మాజీ జెడ్పిటీసీ,బోడుప్పల్ నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బోడుప్పల్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంద సంజీవరెడ్డి గారు విచ్చేసి నాయకులతో కలిసి డిప్యూటి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించిమాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్ధపాలనతోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఆగిపోయాయని ఆరోపించారు. పథకాలను నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కేసులు వేసి స్టే తీసుకువచ్చారని మండిపడ్డారు. ఉద్దేశ పూర్వకంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుకు హాజరు కానందుకే ఈ పథకాలు ఆగిపోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోగా,ఈ పథకాలను ఎత్తేసేందుకు కుట్రలు చేయడం దారుణమన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ముఖ్యమంత్రి హైడ్రాను ఉపయోగించి ఆస్తులు కూడబెట్టుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయన్నారు. హైడ్రాపై వస్తున్న న్యాయపరమైన కేసుల్లో సుప్రీంకోర్టు న్యాయవాదులను వినియోగిస్తూ ప్రజాధనాన్ని భారీగా ఖర్చు చేస్తున్నారని మంద సంజీవరెడ్డి విమర్శించారు. ప్రజల డబ్బును న్యాయపరమైన పోరాటాలకు ఖర్చు చేసే బదులు పేదల సంక్షేమానికి వినియోగించాలని ఆయన అన్నారు. నీ స్వార్థంకోసం పథకాలను రద్దు చేసే ప్రయత్నాలు మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,బోడప్పల్,ఫీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు మీసాల కృష్ణ,రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పోరేటర్లు,సీనియర్ నాయకులు,మహిళా విభాగం నాయకురాళ్లు,యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టరు మధుమోహన్ తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ ఆర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 41 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వివిధ శాఖలకు సంబంధించి సీఎం ప్రజావాణికి మొత్తం ఇప్పటి వరకు జిల్లా నుంచి 244 దరఖాస్తులను ఇవ్వగా ఇంకా 57 ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమంను నిర్వహిస్తున్నందున సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులందరూ తప్పకుండా హాజరై తమ శాఖల పరిధిలో వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలని, అలసత్వం చూపే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో చిన్నపిల్లలను దత్తత తెలంగాణ మహారాష్ట్ర చెందిన దంపతులు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర)సిద్దిపేటజిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లాలో సోమవారం రోజున సిద్దిపేట శిశు గృహాలో ఉన్న 4 పిల్లలను కేరళ, కర్ణాటక,తెలంగాణ,రాష్ట్రలకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి గారి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం సిద్దిపేట జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలో జరిగింది. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలి తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి పిల్లలకు బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పడం జరిగింది మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ/ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జక్ష్ర శారద , జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎ. రాము మరియు శిశు గృహ మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త రాజారాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వజ్రేష్ యాదవ్ ఎవరో తెలియదా ప్రవీణ్ కేసీఆర్,కేటీఆర్‌లకు సింహస్వప్నం

**ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై కాంగ్రెస్ నేతల ఘాటు విమర్శలు**

**ఖబర్దార్ మల్లారెడ్డి.. మేడ్చల్‌లో నీ భరతం పడతాం..**

**నీ కబ్జాల భాగోతం బయటకు తీస్తాం**

**ఫీర్జాదిగూడ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు**




బోడుప్పల్,ఆగస్ట్17(విజన్ ఆంధ్ర): బోడిగుండు తప్ప ఆలోచించే మెదడు లేనట్లుగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ డివిజన్‌లోని బండి కన్వెషన్ హాల్‌లో పోచారం,మేడిపల్లి,ఫీర్జాదిగూడ కాంగ్రెస్ డివిజన్ల అధ్యక్షుల ఆద్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం మేడ్చల్ నియోజకవర్గంలోని బొమ్మరాశిపేటలో జరిగిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై వారు తీవ్రంగా స్పందించారు. వజ్రేష్ యాదవ్ ఎవరో తెలియదా ప్రవీణ్..? కేసీఆర్, కేటీఆర్‌లకు సింహస్వప్నం అంటూకాంగ్రెస్ నాయకులు ఘాటుగా వ్యాఖ్యానించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎన్నికల్లో ఓడిపోయినా,నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకుడు వజ్రేష్ యాదవ్ అని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై గళం విప్పిన ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు అదే విషయాలను మరిచిపోయి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత ప్రవీణ్‌కుమార్ బహుజనవాదాన్ని పక్కనపెట్టి దొరల వాదానికి బానిసగా మారారని ఆరోపించారు. కాగజ్‌నగర్ ప్రజలు తిరస్కరించినా ఆయనకు ఇంకా బుద్ధి రాలేదంటూ తమ నేతలపై నోరు జారే ముందు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఖబర్దార్ మల్లారెడ్డి.. మేడ్చల్‌లో నీ భరతం పడతాం. నీ కబ్జాల భాగోతం బయటకు తీస్తాం అంటూ హెచ్చరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మల్లారెడ్డి రాజకీయ ప్రాభవం క్షీణిస్తోందని, ప్రజలు తిప్పికొట్టే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. స్వంత ఆస్తులు, వ్యాపారాలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై కనిపించడం లేదని ఆరోపించారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని విమర్శించారు. మల్లారెడ్డికి సంబంధించిన కబ్జాల ఆరోపణలను ప్రజల ముందుకు తీసుకువస్తామని కాంగ్రెస్ నేతలు అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పు మల్లారెడ్డికి రాజకీయ గుణపాఠం చెప్పబోతోందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపైనా కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇకనైనా బుద్ధి మార్చుకొని కాంగ్రెస్ నాయకులపై వాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పోచారం,పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్, బండి శ్రీరాములు గౌడ్, తుంగతుర్తి, మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు జలెందర్‌రెడ్డి,మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి,ముదిగొండ రమేష్,కర్రె బలరాం,యాసారం నాగేష్,మోహన్ కుమార్,సుదర్శన్ రెడ్డి,మహ్మద్ మజార్,బర్ల నాగరాజు,మణిరాం నాయక్,సుక్క జయందర్,రాజా రాజు,మహేష్ గౌడ్,సోమయ్య,శ్రీను నాయక్,సాయిరాం గౌడ్, బొల్లగిరి నాగరాజు,శరత్ గౌడ్, కపిల్,మహిళా అధ్యక్షురాలు ఎన్కేఎన్ దుర్గా,తండా పరమేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

**-ఇండోర్ ఎయిర్ క్వాలిటీ నిపుణురాలు డా.ప్రియాంక కులశ్రేష్ఠ**

హైదరాబాద్, ఆగస్ట్ 17 (విజన్ ఆంధ్ర) : వర్షాకాలంలో తేమ పెరగడం, గాలి ప్రసరణ తగ్గడం వల్ల ఇళ్లలో బూజు, డస్ట్ మైట్స్, అలర్జీ కారకాలు పెరిగి తుమ్ములు, అలర్జీ సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలని ఇండోర్ ఎయిర్ క్వాలిటీ నిపుణురాలు డాక్టర్ ప్రియాంక కులశ్రేష్ఠ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఆమె మాట్లాడుతూ వర్షం గాలిలోని పెద్ద కణాలను కొంతవరకు తగ్గించినా, ఇంటి కాలుష్యాన్ని పూర్తిగా తొలగించదని అన్నారు. డైసన్ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ లోగన్ థామ్సన్ సూచనల మేరకు ఇంటిని పొడిగా, శుభ్రంగా ఉంచడం, కార్పెట్లు, కర్టెన్లు, పరుపులు, సోఫాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, అవసరమైతే ఎయిర్ ప్యూరిఫైయర్ వినియోగించడం ద్వారా అలర్జీ కారకాలను తగ్గించవచ్చని అన్నారు. ఏడాది పొడవునా ఇంటి గాలి నాణ్యతపై శ్రద్ధ అవసరమని సూచించారు.

# కళ్యాణ లక్ష్మి పథకాన్ని మళ్లీ కొనసాగించాలి

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన



గద్వాల ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర బ్యూరో)పేద కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని మళ్లీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద భారీ నిరసన చేపట్టారు. బిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంత నాయుడు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూపేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని ఎలాంటి జాప్యం లేకుండా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పథకం ద్వారా ఎంతోమంది పేద కుటుంబాలకు ప్రయోజనం కలిగిందని, ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ అర్హులందరికీ ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు!

## ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల పరిరక్షణకు జేఏసీ ఏర్పాటు

## "సాంకేతిక విద్యను కాపాడాలి.. పాలిటెక్నిక్‌ల ప్రత్యేకతను నిలబెట్టాలి"

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 18(విజన్ ఆంధ్ర) ప్రతిపాదిత 'శక్తి' పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర వ్యవస్థల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది జేఏసీని ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 11 మందితో స్థానిక జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రత్యేకతను కాపాడుకోవడంతో పాటు రాష్ట్రంలోని సాంకేతిక విద్యా వ్యవస్థను పరిరక్షించేందుకు అన్ని వర్గాల సిబ్బంది ఐక్యంగా ముందుకు సాగాలని కళాశాల ప్రిన్సిపాల్ బుగ్గే కరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లంచ్ అవర్‌లో కళాశాల సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. "శక్తి వద్దు.. పాలిటెక్నిక్ కళాశాలలు ముద్దు", "ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను కాపాడాలి" అంటూ నినాదాలు చేశారు. పాలిటెక్నిక్‌ల ప్రత్యేకతను కాపాడాలిఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నాయని తెలిపారు. తక్కువ ఖర్చుతో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తూ ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతున్న పాలిటెక్నిక్‌లను ఇతర వ్యవస్థల్లో విలీనం చేయడం వల్ల వాటి ప్రత్యేకత దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను విలీనం చేయకుండా వాటి ప్రత్యేకతను కాపాడాలని, అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, కోర్సులను మరింత



బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. 11 మందితో స్థానిక జేఏసీ కార్యవర్గంకొత్తగూడెం లోకల్ జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.చైర్మన్: ఎ. మాసయ్యకో–చైర్మన్లు: జీవీఆర్ లక్ష్మణ్ రావు, సీహెచ్ కృష్ణారావు, బి. మస్నాకన్వీనర్: డి. శ్రీనివాస్‌కో–కన్వీనర్: ఎం.డీ. ఫైజ్‌పబ్లిక్ రిలేషన్ సెక్రటరీ: సీహెచ్ రవి కుమార్‌మహిళా విభాగం సెక్రటరీ: పి. వనితఆర్గనైజింగ్ సెక్రటరీ: టి. లింగ్యకమ్యూనికేషన్స్ సెక్రటరీ: బి. రాముకోశాధికారి: డి. శశాంక్‌అన్ని వర్గాల సిబ్బంది ఐక్యంగా ముందుకు రావాలిప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్థానిక జేఏసీలను ఏర్పాటు చేసి వాటిని సెంట్రల్ జేఏసీతో అనుసంధానం చేస్తామని జేఏసీ సభ్యులు తెలిపారు. పాలిటెక్నిక్‌ల పరిరక్షణ కోసం బోధన, బోధనేతర, వర్క్‌షాప్, నాలుగో తరగతి సిబ్బంది అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు కేవలం కళాశాలలు మాత్రమే కాదని, వేలాది మంది విద్యార్థుల సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలకు పునాది అని పేర్కొన్నారు. వాటి భవిష్యత్తును కాపాడేందుకు అవసరమైన అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు."శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు" అనే నినాదంతో ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల పరిరక్షణకు సిబ్బంది ఐక్యంగా కదులుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, చిత్రు

ఆదిలాబాద్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర):ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎటువంటి పెండింగ్ లేకుండా, అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశ్వర్ ఆర్.ఎస్. మరియు చిత్రు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఇరువురూ స్వయంగా పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును సునిశితంగా పరిశీలించి, సంబంధిత శాఖల వారీగా సమీక్షించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వేగవంతమైన సేవలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణిలో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పింఛన్లు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు మరియు భూ సమస్యలకు సంబంధించిన వినతులు అధిక సంఖ్యలో నమోదైనట్లు వారు వెల్లడించారు. అందిన ప్రతి దరఖాస్తును వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డి.ఆర్.ఓ. స్రవంతి, డి.ఆర్.డి.ఏ. రవీందర్ రాథోడ్, ఎ.ఓ. వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 136 ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 17, (విజన్ ఆంధ్ర)ప్రజావాణికి 136 ఫిర్యాదులు సోమవారం సంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి కి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారద దేవి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ ‌60, ఇతర శాఖలు -76, మొత్తం దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# యువత సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు

## మేరా యువభారత్ పోర్టల్ లో యువత నమోదు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర బ్యూరో)యువతకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరమని, యువతను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మై భారత్ ప్రతినిధులు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడంతో పాటు, వారిని బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని యువజన శాఖ ప్రతినిధులను కలెక్టర్ కోరారు. జిల్లాలో యువజన కార్యక్రమాల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై యువతకు వివిధ శాఖల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం యువజన శాఖ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్య, పంచాయతీరాజ్, పరిశ్రమలు, తదితర శాఖలను సమన్వయం చేసుకుని యువతకు ఉపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. యువతలో ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక బాధ్యత, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించేందుకు ఆయా శాఖల అధికారులు తమ సూచనలు, సహకారం అందించాలని కోరారు. యువతను వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించవచ్చని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసి,



వారికి సరైన మార్గనిర్దేశం అందించడం ద్వారా భవిష్యత్ తరాలను మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో యువతను భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలు, కార్యక్రమాలను వినియోగించుకునేందుకు మేరా యువ భారత్ పోర్టల్‌లో యువత తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలు, పరిశ్రమల శాఖతో పాటు ఇతర శాఖలు కూడా తమ పరిధిలోని యువతకు పోర్టల్‌పై అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు, యువజన సంఘాలు, గ్రామ పంచాయతీలు, యువత సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, మై భారత్ జిల్లా సమన్వయకర్త కోటా నాయక్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జంగేడు, ఖాసీంపల్లిలో న్యాయ అవగాహనా సదస్సులు

## మొబైల్ వ్యాన్ లో విస్తృత ప్రచారం

## టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించండి

భూపాలపల్లి జిల్లా 17 ఆగస్టు (విజన్ ఆంధ్ర)జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ఉపయోగించి జంగేడు మరియు ఖాసీంపల్లిలో న్యాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం పొందగోరేవారు, కోర్టు కేసుల్లో చిక్కి ఇబ్బందులు పడేవారు, న్యాయాన్ని పొందలేని నిస్సహాయులు, ప్రామిసరి నోట్ వివాదాలు, కుటుంబ వివాదాలు, సివిల్ కేసులు, మరియే ఇతర కేసుల్లో చిక్కుకొని ఇబ్బందులు పడేవారు జిల్లా న్యాయ సేవధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. సూపరింటెండెంట్ రఘురామ్ మాట్లాడుతూకేసుల్లో రాజీ మార్గాన్ని పాటించాలని, కేసులు



పరిష్కారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివాదాలు లేని సోదరా భావంతో జీవించాలని వారు పేర్కొన్నారు. నల్సా టోల్ ఫ్రీ నెంబర్ 15100 నీ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, వెంకటేష్, రాజ్ కుమార్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా భావించి పరిష్కరించాలని అధికారులనుఆదేశించిన కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 17 ఆగస్టు ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా భావించి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులన ఆదేశించారు.సోమవారం ఐడి ఓసి సమావేశ మందిరంలోనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఆదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి 135 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలుపరిష్కారమవుతాయని ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి దరఖాస్తు చేస్తారని ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు అత్యధిక ప్రాధాన్యతగా భావించి శీఘ్రమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగారాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు మండల స్థాయిలో కూడా ప్రతి సోమవారం ప్రజావాణికార్యక్రమాన్నినిర్వహించడంజరుగుతుంది కాబట్టి ప్రజలు ఈ అవకాశాలకు ఉపయోగించుకొని మండల స్థాయిలో సమస్యలనుపరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ప్రహేబిటరీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు జిల్లాలోని 26 మండల కేంద్రాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఎంపీడీవో నోడల్ అధికారిగానిర్వహించారు.ఇకకార్యక్రమంలోతహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, తదితర అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుండి సమస్యల పరిష్కారానికి ఆర్జీలను స్వీకరించారు.

# విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలి

## పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

## లక్ష్యంతో విద్యాభ్యాసం చేసి భవిష్యత్‌లో స్థిరపడాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

వేములవాడ రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర బ్యూరో):విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుతూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సోమవారం వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు.ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, అనంతరం కిచెన్‌లో కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, పప్పులు, బియ్యం నాణ్యతతో పాటు గడువు తేదీలను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం ఆ రోజు సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో వారితో మాట్లాడి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా అని అడిగి తెలుసుకున్నారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి



భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకున్నారు. ఇప్పటి నుంచే అన్ని పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను సాధన చేయాలని సూచించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. లక్ష్యంతో చదివి, తాము అనుకున్న ఉద్యోగాలు లేదా స్వయం ఉపాధిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెట్టాలని, విద్యాలయంలో అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17,(విజన్ ఆంధ్ర) మంచిర్యాల లయన్స్ క్లబ్ గర్మిళ్ల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. 20,21వ డివిజన్ కార్పొరేటర్లు గంగవరపు వెంకటేశ్వర్లు, జోగుల సదానందం సహకారంతో ఉచిత కంటి శిబిరం నిర్వహించగా విశేష స్పందన లభించింది. 150 మందికి పరీక్షలు నిర్వహించగా 43 మందికి కంటి ఆపరేషన్ అవసరం ఉందని, వీరిని కరీంనగర్ జిల్లా రేకుర్తి లో గల ఆసుపత్రి కి పంపించడం జరిగిందని,ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా ఆపరేషన్ చేసి మంచిర్యాలకు తీసుకొస్తామని తెలిపారు.ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, మంచిర్యాల, గర్మిళ్ళ క్లబ్ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, కార్యదర్శి కాసం మల్లికార్జున్, కోశాధికారి చిట్టా గిరిబాబు, ఆర్సి చక్రధర్, జోన్ చైన్ చైర్మన్ దొంతుల ముఖేష్, బళ్ళు శంకర్ లింగం, సీనియర్ సభ్యులు కొంకుముట్టి వెంకటేష్, రామచందర్, సంపత్, దొడ్డ శ్రీనివాస్, కేశెట్టి శ్రీనివాస్,సుధాకర్ పాల్గొన్నారు.

# భర్తను హత్య చేసిన భార్య..

## ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం..

## ఛేదించిన మేడిపల్లి పోలీసులు

## భార్య అరెస్ట్ రిమాండ్ కు తరలింపు



బోడుప్పల్,ఆగస్టు 17(విజన్ ఆంధ్ర) : భర్తను హత్య చేసి, ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన మహిళను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.మేడిపల్లి ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..ఫీర్జాదిగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన సత్యనారాయణ (51) ఆగస్టు 6న ఇంటికి వచ్చిన అనంతరం భార్య సునీత (44)తో గొడవ జరిగింది. భర్త మానసికంగా వేధించడంతో ఆగ్రహానికి గురైన సునీత అతడి చేతులు, కాళ్లను చీరతో కట్టి, సెంట్రింగ్ కర్రతో తలపై, శరీరంపై దాడి చేసింది. తీవ్ర గాయాలతో సత్యనారాయణ స్పృహ కోల్పోయాడు.అనంతరం కుమారుడు నికిత్‌కు ఫోన్ చేసి వాహనం నుంచి జారిపడి గాయపడ్డాడని తప్పుడు సమాచారం ఇచ్చింది.సత్యనారాయణను మెడిస్టార్ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా రాత్రి 10.18 గంటలకు వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.ప్రమాదం కాదని తేల్చిన పోలీసులుసీసీ కెమెరా ఫుటేజీలు, పోస్టుమార్టం,వైద్యుల అభిప్రాయాలను పరిశీలించిన పోలీసులు ప్రమాదం జరగలేదని గుర్తించారు. సునీతను విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు.నిందితురాలు చూపించిన ప్రదేశం నుంచి చీర, సెంట్రింగ్ కర్రను స్వాధీనం చేసుకున్నారు. తొలుత నమోదైన బిఎన్ఎస్ 106(1) కేసును బిఎన్ఎస్103(1), 238 కింద హత్య కేసుగా మార్చి, సునీతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# జర్నలిస్టు పై దాడికి నిరసనగా ధర్నా నిర్వహించిన జర్నలిస్టులు

## చిట్యాల మండలం న్యూస్ రిపోర్టర్ పుల్ల రవీందర్ పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



భూపాలపల్లి జిల్లా 17 ఆగస్టు (విజన్ ఆంధ్ర)గండ్ర మాట్లాడుతూ:- రిపోర్టర్ కుటుంబ సభ్యులపై జరిగిన దాడి ఏ హియమైన చర్య వార్తలు రాస్తే ఇంటికి వచ్చి దాడి చేయడం కాంగ్రెస్ పార్టీ వారికి మంచిది కాదు అన్నారు. ఈ దాడి పాల్పడిన వారిపై చట్టం కఠినంగా వ్యవహరించి శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా ప్రెస్ క్లబ్ నుండి నిరసనగా అన్ని యూనియన్ సంబంధించిన జర్నలిస్టులు అందరు అంబేద్కర్ సెంటర్ వద్ద ఆందోళన పోరాట కార్యక్రమం నిర్వహించి అనంతరం ఎస్పీ కార్యాలయంకు వెళ్లి ఎస్పీ సిరి శెట్టి సంకీర్త ఐఏఎస్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది, రవీందర్ పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు ఇలాంటి దాడులు జర్నలిస్టులపై ఇకముందు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారుఈ దాడికి నిరసన కార్యక్రమంలో సిపిఐ పార్టీ పక్షాన పాల్గొని వారికి మద్దతు తెలపడం జరిగింది

# మేము అయిజ మండలంలోనే ఉంటాం

## ఎంపీడీవో.కి వినతి పత్రం అందజేసిన పలు గ్రామాల సర్పంచులు

అయిజ ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ఎంపీడీవో కార్యాలయం నందు సోమవారం ప్రజావాణిలో పలు గ్రామాల సర్పంచులు నాయకులు మా గ్రామాల ప్రజలు మేము అయిజ మండలంలోని ఉంటామని ఎంపీడీవో భాస్కర రావు కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూప్రభుత్వం చేపడుతున్న మండలాల పునర్విభజనలో భాగంగా అయిజ మండలంలో ఉన్న కొన్ని గ్రామాలను తీసుకొని కొత్తగా ఏర్పాటు చేస్తున్న మిట్టదొడ్డి మండలంలొ కుట్కనూర్, సిందనూర్, కొత్తపల్లి, తోతినొనిదొడ్డి, ముగోనిపల్లి బూంపురం గ్రామాలను కలపాలని ప్రతిపాదనలు ఉన్నాయని, అలా కలపకూడదు ప్రస్తుతం ఉన్న అయిజ మండలంలో ఉంచాలి ఆ గ్రామాల ప్రజలు కోరారు. మాకు రవాణా, విద్య, వైద్యం పరిపాలన పరమైన సమస్య లు వచ్చి అసౌకర్యం గా ఉంటుంది అని తెలిపారు. అయిజ మండలంలొ ఈ రోజు కొత్తగా జరిగిన ప్రజావాణి కార్యక్రమం లొ వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లొ తోతినొనిదొడ్డి సర్పంచ్ ఎద్దుల రాముడు, సిందనూర్ సర్పంచ్ యస్ ఇంద్రశేనాగౌడ్, కుక్కనూర్ సర్పంచ్ బీమాధాస్, ముగోనిపల్లి సర్పంచ్ నారమ్మా, బూంపురం సర్పంచ్ సరోజ, గ్రామాల పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## భూపాలపల్లి ప్రజా దివాస్కు 13 ఫిర్యాదులు

### ప్రజాదివాస్‌లో బాధితుల వినతులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్



భూపాలపల్లి జిల్లా 17 ఆగస్టు (విజన్ ఆంధ్ర)భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 13 ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, ఇతర పోలీస్ సంబంధిత అంశాలపై వచ్చిన ప్రతి వినతిని ఎస్పీ ఓర్పుగా విని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ :--, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

## రైతు బీమాను వెంటనే పునరుద్ధరించాలి: ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్, ఆగస్టు17 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతు కుటుంబానికి అత్యవసర సమయంలో అండగా నిలిచే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తగా అర్హత పొందిన రైతుల నమోదు మరియు మార్గదర్శకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పాయల్ శంకర్ విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ నిధులు అందిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పలు ప్రధాన డిమాండ్లను లేవనెత్తారు. అర్హత ఉన్న ప్రతి రైతును వెంటనే రైతు బీమా పథకంలో చేర్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట వేసే సమయానికే రైతు భరోసా అందించాలని, అలాగే హామీ ఇచ్చిన విధంగా రూ. 2 లక్షల రుణమాఫీని అర్హులైన ప్రతి రైతుకూ పూర్తిగా వర్తింపజేయాలని స్పష్టం చేశారు. సోయాబీన్ వంటి నూనెగింజల పంటల సాగుకు సీజన్‌కు ముందే నాణ్యమైన విత్తనాలు అందించాలని, ట్రాక్టర్లు, డ్రోన్లు వంటి ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తేవాలని, డ్రిప్, స్ప్రింక్లర్ల సబ్సిడీని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం కింద కేవలం జీవోలు ఇవ్వడమే కాకుండా, నష్టపోయిన రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయాలని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అన్ని అంశాలపై సానుకూల చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాందాస్, దయాకర్, కార్తీక్, సన్నీ, కరుణ్కర్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీనియర్ జర్నలిస్టు లింగాల నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు

### -వనస్థలిపురం కాంప్లెక్స్ సముదాయంలో వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు



ఎల్బీనగర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): తొలివార్త తెలుగు దినపత్రిక ఎడిటర్, సీఈవో లింగాల నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ కాంప్లెక్స్ సముదాయంలో సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు లింగాల నరేందర్ గౌడ్ ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లింగాల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. స్నేహం అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నా మిత్రులు నాపై చూపించినటువంటి ఆదరాభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో వివిధ రంగాల ప్రముఖులు హాజరై లింగాల నరేందర్ గౌడ్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ నర్రి రమేష్, ఓపెన్ ఫ్రేమ్ (ఇంగ్లీష్ దినపత్రిక) ఎడిటర్ కట్ట సత్య నారాయణ వివిధ రంగాల ప్రముఖులు రాచకొండ కృష్ణమోహన్, ఎం సంతోష్ రెడ్డి, గార్లపాటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 19 న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీ బంద్ కి పిలుపునిచ్చిన తుడుందెబ్బ జిల్లా కమిటి

## పోలీస్ రిక్రూట్ మెంట్ లో ఆదివాసిలకు జరిగిన అన్యాయంపై నిరసనగ

ఏజెన్సీ బంద్ కు అందరు సహకరించాలని ప్రకటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు 19-08-2026 బుధవారం రోజున చేపట్టనున్న ఏజెన్సీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆదివాసి నాయకులు, విద్యార్థులు, యువత, వ్యాపారులు మరియు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ మాట్లాడుతూ... ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఏజెన్సీ ప్రాంత ఆదివాసి అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏజెన్సీ ప్రాంత యువతకు పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం రిజర్వేషన్‌తో ప్రత్యేక అవకాశాలు కల్పించేవారని, తద్వారా ఏజెన్సీ ప్రాంత ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేవని అన్నారు. ప్రస్తుతం విడుదలైన నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత లేకుండా సాధారణ విధానంలో నియామకాలు చేపట్టడం వల్ల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వేలాది మంది ఆదివాసి యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయే ప్రమాదం




ఉందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, ఆర్థిక, ఉపాధి పరంగా ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసి యువతకు ఉన్న ప్రత్యేక అవకాశాలను కూడా తొలగించడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి, పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో గతంలో అమలులో ఉన్న 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించిన ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక నిబంధనలు అమలు చేయాలని, ఆదివాసి యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంత ఆదివాసి యువతకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని మండలాల్లోని ఆదివాసి యువత, విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగార్థులు, సామాజిక సంఘాలు, ప్రజా ప్రతినిధులు మరియు వివిధ వర్గాల ప్రజలు ఐక్యంగా నిలిచి బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా వాణిజ్య, వ్యాపార సంస్థల యజమానులు, మార్కెట్ వ్యాపారులు స్వచ్ఛందంగా తమ వ్యాపార కార్యకలాపాలను నిలిపివేసి ఏజెన్సీ బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ముఖ్య సలహాదారు డాక్టర్ కనక ప్రభాకర్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకి తుకారాం, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు కోట్నక రాంశవ్, మడపచి భీంరావు, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సిడాం నాగేష్, మరియు తుడుందెబ్బ నాయకులు, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ లకు కేటాయించిన 0.06 గుంటల భూమిని అక్రమించుకున్న దంటు కలెక్టర్కు ఫిర్యాద

### ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి కలెక్టర్ రాహుల్ శర్మ.






భూపాలపల్లి జిల్లా 17 ఆగస్టు (విజన్ ఆంధ్ర)సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 67 దరఖాస్తులను స్వీకరించారు.ఎఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ :-- ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, వినతుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.రేగొండ మండలం రంగయ్య పల్లి గ్రామ శివారు సర్వేనెంబర్ 713 లో ఎస్సీలకు పింగళి వినోద 1985లో 9 ఎకరాల 08 గుంటల భూమిని దానంగా ఇచ్చారని ఆ భూమిలో ప్రభుత్వం ఆరు గుంటల భూమి కమ్యూనిటీ హాల్కు కేటాయించగా బింగి సాగర్ విఆర్ఓ తన తండ్రి పేరుతో 10.02.1978 లో కొన్నట్లు ఒక కాయితాన్ని సృష్టించి దానిద్వారా అతని పేరుపై మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఈలోపే ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. 1985లో అతని బింగి సాగర్ తండ్రికి అమ్మితే ఆ భూమిని మాకు 1985లో ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ సంబంధిత అధికారులు విచారణ చేసి మాకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చారు దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని సిహెచ్ మల్లయ్య సిహెచ్ శంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం..రూ.238 కోట్ల సీఎంఆర్ బకాయిలు

### -రైస్ మిల్లర్లపై కొరడా
### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిది ఆగస్టు-17(విజన్ ఆంధ్ర)ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్‌కు తీసుకుని సీఎంఆర్ బియ్యం అందించకుండా బకాయిలు పెట్టిన 38 మంది రైస్ మిల్లర్ల వద్ద సుమారు రూ. 238 కోట్ల బకాయిలు ఉన్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం దుర్వినియోగం, లెక్కల్లో చూపకపోవడం తదితర అంశాలపై తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే 7 క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఒకరిపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరో 31 మిల్లుల్లో ధాన్యం నిల్వలు, సీఎంఆర్ డెలివరీ, రికార్డులపై పంచనామా కొనసాగుతోందన్నారు. సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లిలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌లో 7,493.610 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం డిఫాల్ట్‌గా ఉన్నట్లు గుర్తించామని, 25 శాతం పెనాల్టీతో కలిపి రూ. 24.18 కోట్ల బకాయి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలితే క్రిమినల్ కేసులతో పాటు బకాయిల వసూలు, రెవెన్యూ రికవరీ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.


## స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు కీలక సూచనలు



ఆసిఫాబాద్,జిల్లా ప్రతినిధి ఆగస్టు 17:(విజన్ ఆంధ్ర) ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు సోమవారం ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాల బాలికల ప్రాంగణంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ హాజరై ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల సమయ సారిణిని క్రమబద్ధంగా అమలు చేయడం, మోడల్ లెసన్ ప్లాన్ ద్వారా పాఠ్యాంశాలను సమర్థవంతంగా బోధించడం,హెఫ్ ఎల్ ఎన్ ఆధారిత విద్య ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో సమన్వయం పెంచి పేరెంట్స్ టీచర్ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని, విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, యూనిఫామ్‌లు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నోట్‌బుక్స్, బ్యాగుల అవసరాన్ని ముందుగానే గుర్తించి, వాటి పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలల విద్యార్థుల పూర్తి వివరాలతో సమావేశాలకు హాజరై, విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఏఎంఓ పూర్కా ఉద్దవ్, జీసీడీఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కుడ్మేత జంగు, ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్తో పాటు కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమావేశంలో పాఠశాల సమయ సారిణి, విద్యార్థుల హాజరు, మోడల్ లెసన్ ప్లాన్,హెఫ్ ఎల్ ఎన్ విద్య, పాఠశాల వాతావరణం,క్యాజువల్ లివ్ అనుమతులు, పేరెంట్స్ టీచర్ సమావేశాలు, మొక్కల పెంపకం, విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, యూనిఫామ్‌ల పంపిణీ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.


# కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

కాగజ్‌నగర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర):కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బట్టుపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి నిరసన తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక చేయూతనిచ్చే ఈ పథకాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అనేక పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు. ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకాలు దోహదపడుతున్నాయని తెలిపారు. పథకాల కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొంగ సత్యనారాయణ పాల్గొన్నారు. బట్టుపల్లి సర్పంచ్ జాదవ్ రాజేందర్ కూడా నిరసనలో పాల్గొన్నారు. నక్క మనోహర్‌తో పాటు



పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకోలో పాల్గొన్నారు. దీంతో బట్టుపల్లి చౌరస్తాలో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకుని వెంటనే నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయవద్దని డిమాండ్ చేశారు.
పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.

### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయడం సిగ్గుచేటు: మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర):ఆడబిడ్డల కుటుంబాలకు భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కోర్టు సాకుతో నిలిపివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ సిగ్గుమాలిన చర్య అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జోగు రామన్న తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహిళలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి అండగా నిలిచే ఈ సంక్షేమ పథకాలను వెంటనే యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఆడబిడ్డకూ అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందించారని గుర్తుచేశారు. ఈ పథకాల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. 13 వేల కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి బృహత్తర పథకాలను నిలిపివేయడం ద్వారా ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అర్హులైన పేదలకు అందేలా బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఆడబిడ్డల కుటుంబాలకు మద్దతుగా మంగళవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని జోగు రామన్న పిలుపునిచ్చారు. రైతులు, మహిళలు, యువతను మోసం చేస్తూ బూటకపు హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు అజయ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనిస్ అక్బని, సాజితోద్దీన్, స్వరూప రాణి, భోదగం మమత, కాస్తల ప్రేమల తదితర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏ.ఐ.వై.ఎఫ్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

### -అధ్యక్షులుగా ఆర్. బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్




రంగారెడ్డి జిల్లా బ్యూరో ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): అఖిల భారత యువజన సమాఖ్య (ఏ.ఐ.వై.ఎఫ్) హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఆర్.బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏ.ఐ.వై.ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. వలి ఉల్లాహ్ ఖాద్రి ప్రకటించారు. . హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో సోమవారం ఏ.ఐ.వై.ఎఫ్ హైదరాబాద్ జిల్లా 25వ మహాసభల రెండవ రోజు ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభలో నూతన అధ్యక్షులుగా ఆర్. బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్ లతోపాటు ఉపాధ్యక్షులుగా కే. మహేష్, వి. భగత్ సింగ్, కే కళ్యాణ్, సహాయ కార్యదర్శులుగా మజీద్ అలీ ఖాన్, నాగరాజు, అనిల్ కుమార్, కోశాధికారిగా హేమంత్ లతోపాటు 25 మంది సభ్యులతో నూతన కౌన్సిల్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్. బాలకృష్ణ, షేక్ మహమూద్ మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్య, యువత ఎదుర్కుంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, కేంద్ర బీజేపీ పాలనలో ధ్వంసం అవుతున్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించుకోవడానికి బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఏ.ఐ.వై.ఎఫ్ బాపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఉండాలి: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
ఆదిలాబాద్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర):బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి పోలీసులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నాడు నిర్వహించిన 'గ్రీవెన్స్ డే' కార్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 33 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యలపై తక్షణ దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలబడుతుందని, ప్రజలకు న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. అలాగే, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నా 8712659973

# నాగదేవతకు ఘన పూజలు

**- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి**





నిజామాబాద్, ఆగస్టు 17: విజన్ ఆంధ్ర ప్రతినిధి, శ్రావణ మాసంలో వచ్చే విశేషమైన పంచమి సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం నాగుల పంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నాగదేవత ఆలయాలు, పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఉదయం నుంచే పసుపు, కుంకుమ, పాలు, పూలు, పండ్లు, జొన్న పేలాలు, బెల్లంతో తయారు చేసిన ప్రసాదాలను నాగదేవతలకు సమర్పించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా భక్తులు పుట్టల్లో పాలు పోసి నాగదేవతలను పూజించారు. శివాలయాలు సైతం భక్తులతో సందడిగా మారాయి. సోదరుల క్షేమం, ఆయురారోగ్యాలను కోరుతూ మహిళలు, యువతులు ప్రత్యేక పూజలు నిర్వహించడం నాగుల పంచమి ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆవుపాలతో సోదరుల కళ్లను కడిగి వారి మంచి కోరుకున్నారు. నగరంలోని నాగేంద్రుని ఆలయం, వీక్లీ మార్కెట్, రైల్వే స్టేషన్, తిలక్ గార్డెన్, దుబ్బ ప్రభుత్వ ఐటీఐ, పోచమ్మ గల్లీ, వినాయకనగర్, పోచమ్మ దేవాలయం, ఎల్లమ్మ గుడి, నాల్కల్ రోడ్డు, చంద్రనగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు, పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది.

*- ఉచిత ఆవుపాల పంపిణీ*

నాగుల పంచమి సందర్భంగా ఇందూరు గో సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లి, పెద్దబజార్, మిర్చి కాంపౌండ్, గాజులపేట తదితర ప్రాంతాల్లో భక్తులకు ఉచితంగా ఆవుపాలు పంపిణీ చేశారు.

*- భీమరాయ గుడిలో ప్రత్యేక పూజలు*

నగరంలోని గాయత్రినగర్‌లో ఉన్న భీమరాయ గుడిలో నాగదేవతకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట వద్ద పాలు పోసి, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాగమ్మ తల్లి తమ కుటుంబాలను చల్లగా చూడాలని, పాడిపంటలు, సంతానంతో సుఖసంతోషాలతో జీవించాలని మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

# నల్లమల్లలో మళ్లీ విషాదం

**- రోడ్డు ప్రమాదంలో చిరుత కూన మృతి...**

**- అధికారులు గస్తీ ఏం చేస్తున్నారు?... స్థానికుల ఆగ్రహం...**

**- మనుషులకు ఫైన్లు వేస్తారు కానీ వన్యప్రాణులను కాపాడరా?...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 17:

నల్లమల్ల అడవులకు తలమానికమైన చిరుతపులులే ఇప్పుడు రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో మరో చిరుత కూన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

*- ఘటన వివరాలు*

ఆదివారం మధ్యాహ్నం 3:45 గంటలకు మన్ననూర్‌శ్రీశైలం జాతీయ రహదారిపై, మన్ననూర్ రేంజ్ గుండం 'ఈ' బీట్, కంపార్ట్‌మెంట్ నెం.331 వద్ద వేగంగా వచ్చిన తెలియని వాహనం ఢీకొట్టడంతో చిరుత కూన అక్కడికక్కడే మృతిచెందింది. గస్తీలో ఉన్న ఎఫ్ ఎస్ ఓ లు గురువయ్య, గీత రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉన్న కూనను చూసి షాకయ్యారు. ఎన్ టి సి ఏ నిబంధనల ప్రకారం మృతదేహాన్ని భద్రపరచి, సోమవారం లిపశు వైద్యాధికారులు, ఎన్ టి సి ఏ ప్రతినిధి సమక్షంలో పోస్టుమార్టంలి నిర్వహించేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేసింది.

*- "గస్తీ పేరుతో ఏం చేస్తున్నారు?" - స్థానికుల ఫైర్*

ఈ ఘటనతో స్థానికులు, పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. "నల్లమల్ల ప్రాంతానికి చిరుతపులులే అందం. అలాంటి అరుదైన జీవులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోతుంటే అటవీశాఖ అధికారులు ఏం చేస్తున్నారు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. "అడవిలోకి వచ్చే మద్యం తాగే వ్యక్తులపై చలాన్లు వేయడం, జరిమానాలు విధించడంలో చూపించే శ్రద్ధను వన్యప్రాణుల రక్షణలో చూపించడం లేదు. వన్యప్రాణుల బాధ్యతను పూర్తిగా గాలికి వదిలేశారులి

*- " అని ప్రజలు ఆరోపిస్తున్నారు.*


అమ్రాబాద్ అడవుల గుండా వెళ్లే మన్ననూర్-శ్రీశైలం హైవే రాత్రి, పగలు రెండు సమయాల్లోనూ వన్యప్రాణుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయినా స్పీడ్ బ్రేకర్లు లేవు, రాత్రిపూట వేగ నియంత్రణ లేదు, సరైన హెచ్చరిక బోర్డులు కూడా లేవు అని వారు మండిపడుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో చనిపోయిన చిరుతపులి కూన....

*- అధికారుల స్పందన ఏంటి?*

ఈ ఘటనపై విచారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో వాహనదారులు వేగంగా నడపవద్దని, వేగ పరిమితులు పాటించాలని పలుమార్లు సూచించామని చెబుతున్నారు. కానీ స్థానికులు మాత్రం "సూచనలు కాదు, చర్యలు కావాలి" అంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఫెన్సింగ్, అండర్‌పాస్‌లు, రాత్రిపూట ట్రాఫిక్ నియంత్రణ వంటి శాశ్వత పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేస్తున్నారు.




*- ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా?*

గతంలోనూ ఇదే హైవేపై జింకలు, అడవి పందులు, నెమళ్లు రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ప్రతిసారీ అధికారులు "విచారణ జరుపుతాం" అని చెప్పడంతోనే సరిపెడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నది స్థానికుల వాదన. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి కఠిన చర్యలు తీసుకుంటారా? వాహనాలకు జంతువులు బలికాకుండా చూస్తారా?లేక ఇలాంటి విషాదాలు మళ్లీ మళ్లీ పునరావృతమవుతాయా అనేది వేచి చూడాల్సి ఉంది.

*- సారాంశం:*

నల్లమల్లకు వన్నె తెచ్చే చిరుత కూన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అటవీశాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వన్యప్రాణుల రక్షణకు ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# "అధికారం తెచ్చిన జిల్లాలోనే అగ్గి"

**- 14 లో 13 గెలిచిన పాలమూరు...**
**ఇప్పుడు కాంగ్రెస్‌కే తలనొప్పి**

**- "ఎవరు ఉంటారు? ఎవరు పోతారు?"**
**నేతల్లో గందరగోళం - సీఎం మౌనం వెనుక ఏముంది?**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 17: ఉమ్మడి పాలమూరు జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్‌కు "విజయ కోట". 2023 ఎన్నికల్లో 14 సీట్లలో 13 సీట్లు కాంగ్రెస్‌కు వచ్చి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడానికి ప్రధాన కారణమైంది. కానీ అదే జిల్లా ఇప్పుడు పార్టీకి "పెద్ద తలనొప్పి"గా మారింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కూడా తిరగకముందే సీనియర్ల ఫైర్, ఎమ్మెల్యేల గుసగుసలు, టికెట్ ఆరోపణలు... పాలమూరు కాంగ్రెస్ గూటిలో రచ్చ రేగుతోంది. దీంతో కార్యకర్తలు "మేం ఎవరి వైపు ఉండాలి?" అంటూ తలలు పట్టుకుంటున్నారు.

*"జీవన్ రెడ్డిలా నేను కూడా..." చిన్నారెడ్డి సంచలనం*

పాలమూరులో రచ్చకు నిప్పు అంటించింది సీనియర్ నేత జి. చిన్నారెడ్డి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆయన నేరుగా వనపర్తి ఎమ్మెల్యే లిమేఘారెడ్డిలి, సీఎం లిరేవంత్ రెడ్డిలిపైనే తీవ్ర ఆరోపణలు చేశారు. మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి టికెట్ కొనుక్కున్నాడని, సోనియా గాంధీ తనకు టికెట్ ఇచ్చినా డబ్బుకు ఆశపడి రేవంత్ రెడ్డి దాన్ని మేఘారెడ్డికి ఇచ్చారని చిన్నారెడ్డి ఆరోపించారు. అంతేకాదు వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగిపోవడానికి కూడా మేఘారెడ్డే కారణమన్నారు. మంత్రులను అడిగితే మీ ఎమ్మెల్యేనే పనులకు అడ్డుపడుతున్నాడు. కాంట్రాక్టులు తన మనుషులకు రాలేదని




పనులు ఆపిస్తున్నాడులి అని చెప్పారని వెల్లడించారు. మేఘారెడ్డి తన అనుచరులను ఇబ్బంది పెడుతున్నాడని, పరిస్థితి ఇలాగే ఉంటే జీవన్ రెడ్డిలా తాను కూడా తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే పార్టీని మాత్రం వదలనని, మేఘారెడ్డి లాంటి వాళ్లను తరిమేస్తానని స్పష్టం చేశారు.

*అనిరుద్ తర్వాత చిన్నారెడ్డి... పరంపర ఆగడం లేదు*

చిన్నారెడ్డికి ముందు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కూడా నిధుల జాప్యం, సమన్వయ లోపంపై పరోక్ష విమర్శలు చేశారు. "స్థానికంగా ఎవరి ఇష్టం వారిదే" అంటూ అభివృద్ధి ఆగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలు జిల్లాలో పెద్ద దుమారం రేపాయి. ఇప్పుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలతో పాలమూరులోని మిగతా నేతలు కూడా "మాట్లాడాలా? మౌనంగా ఉండాలా?" అని సతమతమవుతున్నారు. జిల్లాలో చాలా నియోజకవర్గాల్లో "ఎవరి పెత్తనం వారిదే" అన్నట్టు వర్గాలుగా చీలిపోయి, కాంట్రాక్టులు, పదవుల కోసం ఘర్షణలు జరుగుతున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ.

*సీఎం మౌనం... వెనుక వ్యూహమా?*

ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న మాట ఏంటీ –"ఎవరు పార్టీలో ఉంటారు, ఎవరు పోతారు అనే దానిపై క్లారిటీ లేకుండా సీఎం స్పందించడం లేదు". వచ్చే ఎన్నికలకు ముందు పార్టీలో పెద్ద ఎత్తున మార్పులు జరిగే అవకాశం ఉందని, అందుకే ఇప్పుడు "చూస్తూ ఊరుకుంటున్నారు" అన్న టాక్ నడుస్తోంది. మరోవైపు "నాయకులకే దిక్కులేదు... కార్యకర్తల సంగతేంటి?"అని శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. బయట చెప్పుకుంటే నియోజకవర్గంలో పరువు పోతుందని చాలా మంది ఎమ్మెల్యేలు గుసగుసలుగా మాత్రమే ఉన్నారని తెలుస్తోంది.

*పాలమూరు,కాంగ్రెస్ వెన్నెముక... ఇప్పుడు పగుళ్లు*

రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట ఒకటే. "పాలమూరు గెలిస్తేనే కాంగ్రెస్ గెలుస్తుంది". 13 సీట్లు ఇచ్చిన జిల్లాలోనే ఇప్పుడు అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరడం పార్టీకి గట్టి దెబ్బ. ఇప్పటికైనా హైకమాండ్ జోక్యం చేసుకుని సయోధ్య కుదురుస్తుందా? లేక ఈ విభేదాలు ముదిరి "వెన్నెముకనే విరిచే" ప్రమాదం ఉందా? అధికారాన్ని తెచ్చిన పాలమూరులోనే ఇప్పుడు కాంగ్రెస్‌కు అతిపెద్ద సవాల్ ఎదురైంది. టికెట్ అమ్మకం ఆరోపణల నుంచి అభివృద్ధి వివాదాల వరకు... "ఎవరు ఉంటారు? ఎవరు పోతారు?" అన్న ప్రశ్నతో జిల్లా కాంగ్రెస్ నేతలు అయోమయంలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడు స్పందిస్తారు? అనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్న.

# జిల్లాలో పని చేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం యాప్ లో నమోదు కావాలి

**- సెన్సస్ హ్యాండ్ బుక్ కొరకు తగిన సమాచారం ఇవ్వాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**




నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర); జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం ముఖ గుర్తింపు హాజరు యాప్ లో నమోదు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన మీ ప్రమాణం యాప్ నమోదు, జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి స్థాయి రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మీ ప్రమాణం యాప్ ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు నమోదు కాని శాఖలు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు. మీ ప్రమాణం హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు సిబ్బంది హాజరు వివరాలు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అలాగే జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన కోరకు, సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత సమాచారం అందించాలని ఆదేశించారు. శాఖల వారిగా అందించే ప్రతి సమాచారం పక్కాగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి లో ప్రతిభ అవార్డు అందుకున్న చిన్నారి



పెబ్బేరు ఆగస్టు17(విజన్ ఆంధ్ర ) : పెబ్బేరు పట్టణ కేంద్రానికి చెందిన అనుష రవిబాబు గౌడ్ దంపతుల కూతురు చతుర్వేద గత మూడు సంవత్సరాలుగా కూచిపూడి నృత్యం లో శిక్షణ తీసుకుంటు ఈ నెల 16న హైదరాబాద్ లోని రాజరాజేశ్వరి గార్డెన్లో అద్వైత్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రోగ్రాంలో అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకుంది. చిన్నారి ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు చిన్నారి చతుర్వేదకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. చతుర్వేద ప్రస్తుతం స్థానిక మాస్టర్ మైండ్స్ హైస్కూల్లో నాలుగో తరగతి చదువుతుంది. ఈ సందర్భంగా చిన్నారి చతుర్వేద గౌడ్ ను, తల్లిదండ్రులను బంధుమిత్రులు, స్థానిక నాయకులు, పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 13 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు



నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) ఆగస్టు 17 సోమవారం : ఈ రోజు నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 13 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 07, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 05, భార్యాభర్తల గొడవలు 01, స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) ఆగస్టు 17 సోమవారం : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరం పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.చెన్నయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కరించిన అనంతరం ఆ సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని ఆదేశించారు.ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలోకి రాని పక్షంలో, దరఖాస్తును సంబంధిత శాఖకు లేఖ ద్వారా పంపించి, ఆ విషయాన్ని ఫిర్యాదుదారునికి తెలియజేయాలని సూచించారు. ఏదైనా సమస్యను నిబంధనల ప్రకారం పరిష్కరించడం సాధ్యం కాకపోతే, ఆ విషయాన్ని స్పష్టంగా ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అంతేతప్ప దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి కార్యాలయం, నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులకు కూడా అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు కలెక్టర్



సూచించారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 36 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని 20 మండలాల పరిధిలో తొలిరోజు నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 103 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వర్తించేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

**- పాలు కొనేందుకు దుకాణానికి వెళ్లిన ఏడేళ్ల బాలికపై అఘాయిత్యం**

**- మియాపూర్‌లో 2023లో నమోదైన కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు**

**- నిందితుడికి రెండు నేరాల్లో చెరో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష**

**- రూ.2 వేల జరిమానా.. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం**


బాచుపల్లి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్‌లోని రాచకొండ జిల్లా అత్యాచారం, పోక్సో కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నిందితుడు మహ్మద్ నజీర్ మియా (57), మియాపూర్ మార్తాండనగర్ నివాసిగా, స్వస్థలం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామంగా పోలీసులు తెలిపారు.

*- పాలు కొనుగోలు చేసేందుకు వెళ్లగా..*

2023 మార్చి 27న ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఏడేళ్ల బాలిక తన ఇంటికి సమీపంలోని కిరాణా దుకాణానికి పాలు కొనుగోలు చేసేందుకు వెళ్లింది. దుకాణంలో ఉన్న నిందితుడు బాలికను లోపలికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. బాలిక తీవ్రంగా ఏడుస్తుండగా దుకాణానికి మరో కస్టమర్ రావడంతో నిందితుడు ఆమెను వదిలిపెట్టినట్లు పోలీసులు తెలిపారు.బాధితురాలు ఏడుస్తూ ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని తల్లికి చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

*- మూడు రోజుల్లో అరెస్టు*

ఫిర్యాదు ఆధారంగా మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మహ్మద్ నజీర్ మియాను 2023




మార్చి 31న అరెస్టు చేశారు. దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం పోలీసులు న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.

*నేరం రుజువు.. శిక్ష ఖరారు*

కేసు విచారణలో పోలీసులు సమర్పించిన ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 376ఏబీ కింద 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా, అలాగే పోక్సో చట్టం-2012లోని సెక్షన్ 5(ఎ) చదివి 6 కింద మరో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. అదనంగా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

*- దర్యాప్తు బృందానికి అభినందనలు*

ఈ కేసులో మియాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రేమ్‌కుమార్ దర్యాప్తు నిర్వహించగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ వెంకటేశ్వర్‌రెడ్డి న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తు, విచారణ సమయంలో సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందాన్ని సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ ఏ. ముత్యం రెడ్డి అభినందించారు.

## బిజెవైఎం ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట వందేమాతారం గీతాలాపన....

**- ప్రజలను చైతన్యవంతం చేసేదే వందేమాతారం గీతం....**

**- బీజేవై ఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ వెల్లడి....**



నిజామాబాద్,ఆగస్టు 17: (విజన్ ఆంధ్ర) నిజామాబాద్ సోమవారం రోజు బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ముందు వందేమాతర గీతాలాపన చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ మాట్లాడుతూ..1905 బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతర గీతం ఒక రణ నినాదంగా మారి అనేకమంది ప్రజలను చైతన్యవంతం చేసినటువంటి గొప్ప నినాదం వందేమాతరం అని అన్నారు.బంకించంద్ర చటర్జీ దూర దృష్టితో వందేమా తర గీతాన్ని రచించి,స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందు కు నడిపించాడని అన్నారు.అటువంటి వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం గా ప్రతి ఒక్క భారతీయుడు మళ్ళీ వందేమాతర గీతా న్ని మదిలో నిలుపుకొని వందేమాతరం యొక్క చరిత్ర తెలుసుకోవాలని,ఆ స్పూర్తితో ముందుకు వెళ్ళాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పూర్తి వందేమాతరం అధికా రిక కార్యక్రమాల్లో పాడాలని చట్టం తీసుకోవడం జరిగిం దని స్పష్టం చేశారు.కానీ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోని యా గాంధీ ఒక వర్గానికి సంతుష్టి కరించాలని ఉద్దేశం తో పూర్తి వందేమాతర గీతాన్ని పాడకుండా అడ్డుకోవ డం సిగ్గుచేటు అని విమర్శించారు.భారత స్వాతంత్రం తీసుకురావడంలో కాంగ్రెస్ పార్టీ కృషి ఉందని చెప్పే నా యకులు,వందేమాతర గీతాన్ని ఆలపించకుండా, కొంతమంది ఓట్ల కోసం దిగుజారుడు చర్యకు పాల్పడం సిగ్గుచేటని వారు దుయ్యబడ్డారు.వందేమాతర గీతం కుల మతాలకతీతంగా ప్రతి భారతీయుడు ఆలపించా లని ఈ సందర్భంగా వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేట్లు ఎర్రంసుధీర్,చిరంజీవి,శశాంక్,శ్రావణ్ , బీజేవైఎం నాయకులు విపుల్,ప్రశాంత్, రాజశేఖర్, మల్కాయ్ మహేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## బడులలో అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి

**- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెడతాం**

**- వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి**

**- కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**



నిజామాబాద్, ఆగస్టు 17 : (విజన్ ఆంధ్ర )ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు వీలుగా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ చాంబర్ లో సోమవారం ఆయన కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అసంపూర్తి పనులను గుర్తించి, విద్యార్థులు సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడ కూడా తాగునీరు, టాయిలెట్స్ వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని, నూటికి నూరు శాతం పనులు నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విషయమై ఉన్నతాధికారులను సంప్రదించి మంజూరు చేయిస్తానని తెలిపారు. అయితే పనులను పూర్తి చేయించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని హితవు పలికారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, మరమ్మతుల కోసం వీబీజీరాంజీ పథకం కింద ప్రతిపాదనలు పంపాలని, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలను వేగవంతంగా కుట్టించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉన్న బడులలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బోధకులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేలా కృషి చేయాలన్నారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత మంది నుండి ఏమేరకు బకాయిలు రాబట్టగలిగారు, ఇంకా ఎంత మంది సీ.ఎం.ఆర్ కు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు సముఖంగా ఉన్నారు తదితర వివరాలను ఆరా తీశారు. బకాయిలు చెల్లించని మిల్లర్లకు నోటీసులు జారీ చేసి, రెవెన్యూ రికవరీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ శాఖ పనితీరును సమీక్షిస్తూ, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనులు, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా రోజువారీగా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనూ ఇంటింటి చెత్తను వెంటదివెంట తరలించేందుకు వీలుగా డంపింగ్ యార్డ్ మల్టిపుల్ పాయింట్స్ ను ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు. సమీక్షా సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, డీ.ఈ.ఓ పి.అశోక్, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించి ఫిర్యాదు దారునికి సమాచార ఇవ్వాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎన్ ఖీమ్య నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగ అదనపు కలెక్టర్ అధికారులకు సూచనలు ఇస్తూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 45 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 5 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జెడ్పి సీఈవో యాదయ్య, శిక్షణ ఉప కలెక్టర్లు మేడం శ్రావ్య, రంజిత్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి

**- వేముల ప్రశాంత్ రెడ్డి**



కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి సహా పేదల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కళ్యాణలక్ష్మి పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మహిళలతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహ భారం తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయని వేముల తెలిపారు. ఈ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తామని ప్రభుత్వం కోర్టులో స్పష్టమైన అఫిడవిట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి కింద రూ.1,00,116 ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సుమారు 500 మంది, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అర్హత పొందిన మరో 4,500 మందితో కలిపి దాదాపు 5,000 మంది ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వాల్సి ఉందన్నారు. ఒక్కొక్కరికి తులం చొప్పున సుమారు 50 కిలోల బంగారం, ప్రస్తుత అంచనా ప్రకారం రూ.75 కోట్ల విలువ ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రుణమాఫీ వంటి పలు హామీలు ఇచ్చారని, వాటి అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని వేముల డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికుల పెన్షన్లు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, కంటి వెలుగు వంటి పథకాలను అమలు చేశామని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అర్హత పొందిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల పంపిణీ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రైతులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలందించే కేంద్రాలుగా ఉండాలి తప్ప రాజకీయ పైరవీలకు వేదికలుగా మారకూడదని వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తహశీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో అధికార పార్టీ నాయకుల జోక్యం పెరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడు జీవితంలో ఎప్పుడు కూడా ప్రజా ఉ ద్యమంలో పాల్గొనలేదు...

**- కార్పొరేటర్ లు ఎర్రం సుదీ ర్,సాయి వైష్ణవిలు ఆరోపించారు....**

**- ఎంపి అరవింద్ పై చిల్లర మాటలు,అసత్య ఆరోపణలు మానుకోండి...**

**- కార్పొరేటర్లు హెచ్చరిక...**

**- జిల్లాలో బిజెపి బలంగా ఉంది.**

**- 28 కార్పొరేటర్లు,100 మందికి పైగ సర్పంచ్ లు,ఇద్దరు ఎమ్మెల్యేలు,లక్షలాది కార్యకర్తలు ఉన్నారు...కార్పొరేటర్లు స్పష్టం....**



నిజామాబాద్,ఆగస్టు 17: (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ విసిరే బిస్కెట్లకు ఆశపడి కొంతమంది నాయకులు ఈమధ్య ఎంపీ అరవింద్ ధర్మపురిపై కుక్క ల్లా మొరుగుతున్నారని నిజామాబాద్ నగరంలోని 35వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ ఎర్రం సుధీర్,22వ డివిజన్ కార్పొరేటర్ సాయి వైష్ణవిలు ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేంలో మాట్లాడుతూ..పీసీసీ అధ్యక్షు డు మహేష్ కుమార్ గౌడ్ తన జీవితంలో ఎప్పుడూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనలేదని,ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన చరిత్ర కూడా ఆయనకు లేదని 35 వ డివిజన్ కార్పొరేటర్ గుర్రం సుధీర్ అన్నారు.ఇక బాల్కొండకు చెందిన ఈరవత్రి అనిల్ గతంలో చిరంజీ వి పుణ్యమా అని ఒకసారి గెలవడం తప్ప,ఆ తర్వాత ఏనాడూ ఎన్నికల్లో గెలవలేదని,అలాంటి వ్యక్తి తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఎంపీ అరవింద్ పై చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించా రు.తెలంగాణ రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా బీజేపీ అత్యంత బలంగా ఉంది అని,జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యే లు,28 మంది కార్పొరేటర్లు,100కి పైగా సర్పంచులు, లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారంటే అది బలమైన బీసీ నాయకుడు అరవింద్ ధర్మపురి నాయకత్వ బల మే అని స్పష్టం చేశారు.అలాంటి ప్రజా నాయకుడిపై చిల్లర మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేద ని,ఖబడ్దార్ అంటూ కాంగ్రెస్ నాయకులను హెచ్చరిం చారు.కాంగ్రెస్ పార్టీ నాయకులకు సవాల్ విసురుతు న్నాం,మహేష్ కుమార్ గౌడ్ తన జీవితంలో కనీసం కౌన్సిలర్‌గా లేదా కార్పొరేటర్‌గా కూడా గెలవలేదని ఏద్దేవా చేశారు.నగరంలోని బీజేపీ గెలిచిన 28 డివిజ న్లలో ఆయన ఎక్కడ పోటీ చేస్తారో చెప్పండి.ఆ డివిజ న్ కార్పొరేటర్‌తో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్దాం అని, ప్రజల్లో మహేష్ కుమార్ గౌడ్ స్థాయి ఏం టో అప్పుడు తెలుస్తుంది అన్నారు.మాట్లాడేటప్పుడు ఒళు ్ళ దగ్గర పెట్టుకుని మాట్లాడాలి,రోడ్లపై పరుగెత్తించి కొడతాం,ఇళ్లపై దాడి చేస్తాం అంటే బీజేపీలో ఉన్న కరు డుగట్టిన కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు అని హెచ్చరిం చారు.ఎంపీ అరవింద్ ఎల్లప్పుడూ జిల్లా అభివృద్ధి గురించే ఆలోచిస్తారు తప్ప చిల్లర రాజకీయాలు చేయ రని,కొడంగల్,ఖమ్మం నియోజకవర్గాలకు నిధులు ఇస్తు న్నప్పుడు నిజామాబాద్ జిల్లాకు ఎందుకు నిధులు తేవ ట్లేదు? పీసీసీ అధ్యక్షుడిగా ఉండి జిల్లాకు కనీసం కోటి రూపాయల ప్రత్యేక నిధులైనా తెచ్చారా?,ఉద్యోగాలు లేవు,అభివృద్ధి లేదు,రైతుల గోడు పట్టించుకునే నాథు డే లేదు.ఇంతటి అసమర్ధ పాలనను ఎప్పుడూ చూడ లేదు అయన పేర్కొన్నారు కార్పొరేటర్ సాయి వైష్ణవి గారు మాట్లాడుతూ..కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి 28 అత్యధిక స్థానాలు సాధించినప్పటికీ...కాంగ్రెస్ బీఆర్ ఎస్,ఎంఐఎం పార్టీలు అక్రమంగా పొత్తు పెట్టుకుని మేయర్ పీఠాన్ని దక్కించుకున్నాయి.కాంగ్రెస్ మేయర్ అయితే నగరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన మహేష్ కుమార్ గౌడ్,ఇప్పటివరకు ఏం అభివృద్ధి చేశారో సమా ధానం చెప్పాలి అని ప్రశ్నించారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నివసించే 22వ డివిజన్‌లోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నేను ఓడించాను.ఆ ఓటమిని జీర్ణించుకోలేక మహేష్ కుమార్ గౌడ్ మా డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా బెదిరింపులకు దిగుతూ అడ్డుకుంటున్నారని విమర్శించారు.ఆయన కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే,నేను నా కార్పొరేటర్ పదవి కి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను,మళ్ళీ పోటీకి రండి.లేదంటే మీ వ్యక్తిగత ఈగోలను పక్కనపె ట్టి నిజామాబాద్ నగర అభివృద్ధికి,డివిజన్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.ఈ యొక్క సమావేశం లో కార్పొరేటర్లు బెల్లల్ శశాంక్,నిమ్మల శ్రావణ్,కల్పే అర్చన,యాదల నరేష్,ఎస్సి మోర్చ అధ్యక్షులు పురు షోత్తం,నాయకులు సుధా మాటురి,కల్పే చిరంజివి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలపై తక్షణమే స్పందించాలి

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసిన ఫిర్యాదులపై పోలీసు అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది బాధితుల నుంచి ఆమె నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే ఫోన్ ద్వారా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు చట్టపరిధిలో పూర్తి భరోసా కల్పిస్తూ ఎస్పీ తీసుకున్న వేగవంతమైన నిర్ణయాలపై అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## నీటి కొరత ప్రాంతాల్లో ఆరుతడి పంటలే మేలు

**- అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్**

**- ప్రత్యామ్నాయ సాగుపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు వరికి బదులుగా మినుములు, వేరుశెనగ, మొక్కజొన్న, ఆముదం వంటి ఆరుతడి పంటల సాగుకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులుతో కలిసి సోమవారం తన ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. తక్కువ నీటితో పూర్తయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా భూగర్భ జలాలను ఆదా చేయడంతో పాటు సాగు నష్టాలను ముందస్తుగానే అరికట్టవచ్చు. కందిమినుములు, ఆముదంమినుములు, మొక్కజొన్నమినుములు వంటి అంతర పంటల సాగును రైతులు ఎక్కువగా చేపట్టేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రోత్సహించాలి. ఎల్‌నినో పరిస్థితులు, రానున్న రోజుల్లో ఏర్పడే నీటి కొరతను అంచనా వేసుకుని రైతులు ముందస్తుగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలి. నేల పరిస్థితులు, నీటి లభ్యత ఆధారంగా అనువైన పంటల ఎంపికపై రైతులకు అవసరమైన సలహాలు అందించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయభాస్కర్, డిఎల్పీఓ రఘునాథ్, హౌసింగ్ పీడీ విఠోబా, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

*సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, సవరణలకు దరఖాస్తు చేసుకోవాలి*



నిజామాబాద్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా సోమవారం విడుదల చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ముసాయిదా జాబితాలో తమ పేరు, వివరాలను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా, మార్పులు లేదా సవరణలు అవసరమైనా సెప్టెంబర్ 16, 2026లోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు జిల్లాలో 14,39,734 మంది ఓటర్లు ఉండగా, ఆగస్టు 17, 2026 నాటికి ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముసాయిదా జాబితా ప్రకారం 12,28,064 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. వీరిలో 5,83,035 మంది పురుషులు, 6,44,987 మంది మహిళలు, 42 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య: ఆర్మూర్1,89,457, బోధన్1,95,344, బాన్సువాడ1,76,449, నిజామాబాద్ అర్బన్2,24,979, నిజామాబాద్ రూరల్2,33,578, బాల్కొండ2,08,257 మంది ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు లేకుండా పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. ముసాయిదా జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందిస్తామని పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలి

**- హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డలకు అన్యాయం చేయొద్దు**

**- కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**



నిజామాబాద్ ఆగస్టు17:( విజన్ ఆంధ్ర ): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ గారి పిలుపు మేరకు, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బిగాల గారి ఆదేశాల మేరకు, సోమవారంబీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు ఆధ్వర్యంలో ఈరోజు నిజామాబాద్ ధర్నా చౌక్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లి“జవీ ణశీషఅ ణశీషఅ”లి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన లికళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందనిలి ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఎంతటి ఆర్థిక భారంగా మారుతుందో గుర్తించిన అప్పటి మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ 2014 అక్టోబర్ 2న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రారంభంలో రూ.51 వేలుగా ఉన్న ఆర్థిక సహాయాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచి పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు లి13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయంలి అందించారని, కరోనా వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలో కూడా కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ పేద కుటుంబాలకు భరోసా కల్పించారని పేర్కొన్నారు. అయితే ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు ఆడబిడ్డలకు లితులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ,లి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి, దానినే రద్దు చేసే కుట్రకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కోసం ఆడబిడ్డలు, వారి కుటుంబాలు ప్రశ్నిస్తుండటంతో ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పథకాన్నే ఎత్తివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి పరిస్థితి దారుణంగా మారిందని, అర్హత ఉన్న అనేక మంది లబ్ధిదారులు పెళ్లిళ్లు పూర్తయి చాలా కాలం గడిచినా తమకు రావాల్సిన ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో పిల్లలు పుట్టేంత కాలం గడిచినా కళ్యాణ లక్ష్మి సాయం అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో కళ్యాణ లక్ష్మి అంశంపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ప్రశ్నించారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం తన వాదనను బలంగా వినిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన వివిధ కేసులు, అవినీతి ఆరోపణలు, ఇతర అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులను భారీ మొత్తాలు చెల్లించి నియమించుకునే ప్రభుత్వం, పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని కాపాడేందుకు మాత్రం ఎందుకు సమర్థవంతంగా న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదని, తెలంగాణలోని పేదింటి ఆడబిడ్డల లిఆత్మగౌరవం, భవిష్యత్తు, కుటుంబాలకు ఆర్థిక భరోసాతో ముడిపడిన సంక్షేమ కార్యక్రమాలనిలి బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్ష సాధింపులను పక్కనపెట్టి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిస్థాయిలో కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకూడదని బీఆర్ఎస్ పార్టీ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,మాజీ చీఖణూ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,నాగారం నర్సింగ్ ,నవీద్ ఇక్బాల్,అబ్దుల్ మతీన్, జగత్ రెడ్డి ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ

**- 'ఛలో ట్యాంక్ బండ్'**



మల్కాజిగిరి, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): బహు జన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని వినాయక్ నగర్ గౌడ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం 'ఛలో ట్యాంక్ బండ్' వాల్ పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ...మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ట్యాంకుబండ్ పైన శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావునా గౌడ కులస్తులు అందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినాయక్ నగర్ గౌడ సంఘం సభ్యులు భాష గౌడ్,నందం గౌడ్,పోచయ్య గౌడ్,నరసింహ గౌడ్,బాలేష్ గౌడ్,కృష్ణమూర్తి గౌడ్, విష్ణు మూర్తి గౌడ్, కృష్ణ గౌడ్, శేఖర్ గౌడ్,శశి గౌడ్,జగన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాములు గౌడ్, నరసింహ గౌడ్,శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బోనాల ఉత్సవాలు ప్రతీక మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



మల్కాజిగిరి, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బోనాల ఉత్సవాలు ప్రతీక అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మౌలాలి హనుమాన్ నగర్ లో 186వ డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద జరిగిన బోనాల పండుగకు మైనంపల్లి హనుమంత రావు హాజరై, అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని ఆశీర్వదం తీసుకున్నారు. ఈ సందర్భంగా బోనాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ...అమ్మవారి కృపతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో కాలనీవాసులు, మహిళలు, యువకులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

**- పుట్టలో పాలు పోసి మహిళల పూజలు**



అల్వాల్, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): శ్రావణ మాసంలో వచ్చే నాగపంచమి పురస్కరించుకొని సోమవారం అల్వాల్ లోని పలు నాగ దేవత ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. నాగదేవతకు పుట్టలో పాలు పోసేందుకు ఉదయం నుంచే మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున ఆయా కాలనీలలో వెలసిన పుట్టల వద్దకు చేరి, పాలు, నైవేద్యంతో బారులు తీరారు. అల్వాల్ మున్సిపల్ కార్యాలయం దగ్గర గల నాగదేవత గుడిలో ఉదయం నుండే భక్తులు పుట్టలో పాలు పోసేందుకు బారులు తీరి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ.. శ్రావణ మాసంలో వర్షాలు ప్రారంభమైనందున పాములు కూడా ఎక్కు వగా సంచరించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, కుటుంబ సభ్యులను నాగ దేవత కాపాడాలని పుట్టలో పాలు పోసి, ఎంతో భక్తి శ్రద్ధలతో పుట్టల వద్ద పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తద్వారా సర్ప దోషాలు తొలగుతాయని నమ్మకంతో ఎంతో మంది భక్తులు పుట్టలో పాలు పోయటం ఆచారంగా వస్తోందని తెలిపారు.


## బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబుకు పితృ వియోగం

***మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్, మాజీ ఎమ్మెల్సీ 'మైనంపల్లి'.. పరామర్శ***



అల్వాల్, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు తండ్రి బాలరాజు గౌడ్ సోమవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు తదితరులు మృతుడి నివాసానికి వెళ్లి, పార్థీవ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు.

## ప్రజావాణికి 80 ఫిర్యాదులు



నిజామాబాద్, ఆగస్టు 17 :(విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్న, ట్రైనీ ఆర్డీఓ సందీప్, రూరల్ ఎస్.హెచ్.ఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం ఒక మెతుకు కూడా వృధా చేయకండి...!

**- లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు...**

**- లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 32 సి 11 ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తున్న ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు**








కాప్రా /ఆగష్టు 17( విజన్ ఆంధ్ర ప్రతినిధి) మనం తినే ప్రతి మెతుకు పరబ్రహ్మ స్వరూపమని ఒక మెతుకు కూడా వృధా చేయవద్దని లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా మద్దూరి స్వరూప గార్డెన్లో లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320 సి నూతన గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన 11వ. ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటిలో ప్రతి మెతుకు విలువ కడతామని అదేవిధంగా ఫంక్షన్లలో కూడా బలవంతంగా ఆహారం వేసుకొని వృధా చేయవద్దని తినగలిగినంతనే వేసుకోవాలని తినగలిగినంతనే వడ్డించాలని 50% పైగా అన్నం వృధా చేస్తున్నారని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 50 నుంచి 70% అన్నావ్ కదా అన్నం వృధా అయితే లక్షలాది రూపాయలు నష్టపోవడంతో పాటు మనకు కన్నాన్ని సరఫరా చేసే రైతు కష్టానికి వెలకట్టలేమని ఆయన కష్టానికి వృధా చేసినట్లు అవుతుందని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. లైన్స్ క్లబ్ ద్వారా సేవలందించడానికి ముందుకు వచ్చి తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తూ సేవలను చేస్తున్న లైన్స్ క్లబ్ వారందరినీ అభినందించారు. అట్టి డబ్బులు వృధా కాకుండా పొదుపుతో ఖర్చు చేయాలని సూచించారు. 11వ డిస్టిక్ 320ఓ అధ్యక్షునిగా ఎన్నికైన కళ్లెం కృష్ణారెడ్డి అంతర్జాతీయ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో హాంకాంగ్లో ప్రమాణ స్వీకారం చేయగా, కాప్రా మరో అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ కేజీ రామకృష్ణమూర్తి ఇన్స్టాలేషన్ ఆఫీసర్గా వ్యవహరించి మొదటి వైస్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మండా సురేష్, రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుంటుక శేఖర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి కళ్లెం మోహన్ రెడ్డి, కోశాధికారి మూలవర్తి శ్రీనివాస్, డిస్టిక్ చీఫ్ కోఆర్డినేటర్ గుడి గంటల రాములు ఈ సందర్భంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ మల్టిపుల్ గవర్నర్లు మాజీ గవర్నర్లు కోఆర్డినేటర్లు ,కార్యక్రమంలో మాజీ గవర్నర్లు డాక్టర్ కే హరీష్ రెడ్డి, ఇన్నారెడ్డి, సూర్య నారాయణ, వెంకటనారాయణ రెడ్డి, లైన్స్ సీనియర్లు నాగన్న దత్తు, రీజినల్ చైర్మన్లు ఆర్ శ్రీనివాస్ రెడ్డి , రాజేంద్రప్రసాద్,ఏ టు జెడ్ శ్రీనివాసరెడ్డి, కేసరి శ్రీనివాసరెడ్డి, పెంటయ్య గౌడ్,జోన్ చైర్ పర్సన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి పావనిరెడ్డి,సుమలత,రమాదేవి,విజయ్ వాణీ తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయం ప్రారంభం

**- ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా మోమిన్ భాష నియామకం**



మల్కాజిగిరి, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా మోమిన్ భాష నియమితులయ్యారు. ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బిజ్జుల రామకృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రావణ్ కుమార్ గుప్తా ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయాన్ని వారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజ్జుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ...జిల్లాలోని కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో పని చేస్తున్న ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం పని చేస్తూ, నిరంతరం కార్మికులకు అండగా ఉంటుందన్నారు. ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ కృషి చేస్తుందని తెలిపారు. కార్మికులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ వారి హక్కుల కోసం నిరంతరం పోరాడ తామని చెప్పారు.భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఓసీ) రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమ మండలి ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డులు తదితర ప్రయోజ నాలను అర్హులైన ప్రతి కార్మికుడు పొందేలా ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ సహకారం అందిస్తుందని చెప్పారు. అలాగే కార్మికు లకు ప్రమాదాలు జరిగిన ప్పుడు బీమా తదితర ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా పని చేస్తామని ఆయన తెలిపారు. కార్మికుల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా ఫెడరేషన్ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మెయిన్ భాష మాట్లాడు తూ, తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జాతీయ, రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ మేడ్చల్మల్కాజిగిరి జిల్లాలోని కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. కార్మికులు, పేదల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ ముఖ్య నాయకులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మణికంఠ,ఎండీ రఫీ, నందరం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధు లు, కార్మికులు పాల్గొన్నారు.

# "అధికారం తెచ్చిన జిల్లాలోనే అగ్గి"

**- 14 లో 13 గెలిచిన పాలమూరు... ఇప్పుడు కాంగ్రెస్‌కే తలనొప్పి**

**- "ఎవరు ఉంటారు? ఎవరు పోతారు?" నేతల్లో గందరగోళం**

**- సీఎం మౌనం వెనుక ఏముంది?**




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 17: ఉమ్మడి పాలమూరు జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్‌కు "విజయ కోట". 2023 ఎన్నికల్లో 14 సీట్లలో 13 సీట్లు కాంగ్రెస్‌కు వచ్చి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడానికి ప్రధాన కారణమైంది. కానీ అదే జిల్లా ఇప్పుడు పార్టీకి "పెద్ద తలనొప్పి"గా మారింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కూడా తిరగకముందే సీనియర్ల ఫైర్, ఎమ్మెల్యేల గుసగుసలు, టికెట్ ఆరోపణలు... పాలమూరు కాంగ్రెస్ గూటిలో రచ్చ రేగుతోంది. దీంతో కార్యకర్తలు "మేం ఎవరి వైపు ఉండాలి?" అంటూ తలలు పట్టుకుంటున్నారు.

**"జీవన్ రెడ్డిలా నేను కూడా..." చిన్నారెడ్డి సంచలనం**

పాలమూరులో రచ్చకు నిప్పు అంటించింది సీనియర్ నేత జి. చిన్నారెడ్డి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆయన నేరుగా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, సీఎం రేవంత్ రెడ్డిపైనే తీవ్ర ఆరోపణలు చేశారు. మేఘారెడ్డి డబ్బులు ఇచ్చి టికెట్ కొనుక్కున్నాడని, సోనియా గాంధీ తనకు టికెట్ ఇచ్చినా డబ్బుకు ఆశపడి రేవంత్ రెడ్డి దాన్ని మేఘారెడ్డికి ఇచ్చారని చిన్నారెడ్డి ఆరోపించారు. అంతేకాదు వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగిపోవడానికి కూడా మేఘారెడ్డే కారణమన్నారు. మంత్రులను అడిగితే మీ ఎమ్మెల్యేనే పనులకు అడ్డుపడుతున్నాడు. కాంట్రాక్టులు తన మనుషులకు రాలేదని పనులు ఆపిస్తున్నాడు అని చెప్పారని వెల్లడించారు. మేఘారెడ్డి తన అనుచరులను ఇబ్బంది పెడుతున్నాడని, పరిస్థితి ఇలాగే ఉంటే జీవన్ రెడ్డిలా తాను కూడా తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే పార్టీని మాత్రం వదలనని, మేఘారెడ్డి లాంటి వాళ్లను తరిమేస్తానని స్పష్టం చేశారు.

**అనిరుద్ తర్వాత చిన్నారెడ్డి... పరంపర ఆగడం లేదు**

చిన్నారెడ్డికి ముందు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కూడా నిధుల జాప్యం, సమన్వయ లోపంపై పరోక్ష విమర్శలు చేశారు. "స్థానికంగా ఎవరి ఇష్టం వారిదే" అంటూ అభివృద్ధి ఆగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలు జిల్లాలో పెద్ద దుమారం రేపాయి. ఇప్పుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలతో పాలమూరులోని మిగతా నేతలు కూడా "మాట్లాడాలా? మౌనంగా ఉండాలా?" అని సతమతమవుతున్నారు. జిల్లాలో చాలా నియోజకవర్గాల్లో "ఎవరి పెత్తనం వారిదే" అన్నట్టు వర్గాలుగా చీలిపోయి, కాంట్రాక్టులు, పదవుల కోసం ఘర్షణలు జరుగుతున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ.

**సీఎం మౌనం... వెనుక వ్యూహమా?**

ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న మాట ఏంటీ -"ఎవరు పార్టీలో ఉంటారు, ఎవరు పోతారు అనే దానిపై క్లారిటీ లేకుండా సీఎం స్పందించడం లేదు". వచ్చే ఎన్నికలకు ముందు పార్టీలో పెద్ద ఎత్తున మార్పులు జరిగే అవకాశం ఉందని, అందుకే ఇప్పుడు "చూస్తూ ఊరుకుంటున్నారు" అన్న టాక్ నడుస్తోంది. మరోవైపు "నాయకులకే దిక్కులేదు... కార్యకర్తల సంగతేంటి?"అని శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. బయట చెప్పుకుంటే నియోజకవర్గంలో పరువు పోతుందని చాలా మంది ఎమ్మెల్యేలు గుసగుసలుగా మాత్రమే ఉన్నారని తెలుస్తోంది.

**పాలమూరు,కాంగ్రెస్ వెన్నెముక... ఇప్పుడు పగుళ్లు**

రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట ఒకటే. "పాలమూరు గెలిస్తేనే కాంగ్రెస్ గెలుస్తుంది". 13 సీట్లు ఇచ్చిన జిల్లాలోనే ఇప్పుడు అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరడం పార్టీకి గట్టి దెబ్బ. ఇప్పటికైనా హైకమాండ్ జోక్యం చేసుకుని సయోధ్య కుదురుస్తుందా? లేక ఈ విభేదాలు ముదిరి "వెన్నెముకనే విరిచే" ప్రమాదం ఉందా? అధికారాన్ని తెచ్చిన పాలమూరులోనే ఇప్పుడు కాంగ్రెస్‌కు అతిపెద్ద సవాల్ ఎదురైంది. టికెట్ అమ్మకం ఆరోపణల నుంచి అభివృద్ధి వివాదాల వరకు... "ఎవరు ఉంటారు? ఎవరు పోతారు?" అన్న ప్రశ్నతో జిల్లా కాంగ్రెస్ నేతలు అయోమయంలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడు స్పందిస్తారు? అనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్న.

## మల్కాజిగిరి ప్రజావాణిలో 35 ఫిర్యాదులు

మల్కాజిగిరి, ఆగస్ట్ 17, (విజన్ ఆంధ్ర): మల్కాజి గిరి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాజి గిరి జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల నుండి అధికారులు, మొత్తం 35 ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో మల్కాజిగిరి సర్కిల్ 07,మౌలాలి సర్కిల్ 10,బోయిన్ పల్లి సర్కిల్ 01, అల్వాల్ సర్కిల్ 01,కీసర సర్కిల్ 16. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.... ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అన్ని ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు దారులకు త్వరితగతిన ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్కాజి గిరి డిప్యూటీ కమిషనర్, జకీయా సుల్తానా, సూపరింటెండింగ్ ఇంజనీర్ లక్ష్మణ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)వి.బి. శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఈ. లౌక్య, జి.కవిత, ఏఎంసీలు అజయ్, డి.శాంతి ప్రియ, వెటర్నరీ ఆఫీసర్ డా. టి. సంజయ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాది దారుల నుండి 31 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్




నిజామాబాద్ ఆగస్టు17:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ సోమవారం ఈ రోజు నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గౌరవనీయులు పోలీస్ కమిషనర్ శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్.,ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ మరియు సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని లిగౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

**- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర); ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి

**- కె.రాహుల్ రెడ్డి,డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్**



మల్కాజిగిరి, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): సాధారణ ట్రాఫిక్ రాకపోకలు సజావుగా కొనసాగేలా తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, కె.రాహుల్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశించారు. సోమవారం మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాజ్ పేయినగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్ యుబి) నిర్మాణ పనులు, ఉత్తమ్ నగర్‌లో సీసీ రోడ్డు పనుల నేపథ్యంలో ఆయన, మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. నరసింహ, రైల్వే, ఎంఎంసీ అధికారులు ఏఈ దివ్య జ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంతో కలిసి పై పనులు జరుగు ప్రదేశాలను సందర్శించి, ట్రాఫిక్ సమస్యలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా కె.రాహుల్ రెడ్డి మాట్లాడుతూ... నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో అవసరమైన ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. వాహన దారులు, సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు సాధారణ ట్రాఫిక్ రాకపోకలు సజావుగా, నిరంతరాయంగా కొనసాగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

# ఐటిడిఏ స్కావెంజర్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి

**- సెప్టెంబర్ 1 నుండి వంట మాత్రమే చేస్తాం**

**- స్కావెంజర్ల సంఘం హెచ్చరిక.**



ములుగు ఆగస్ట్ 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : శనివారం ఏటూరు నాగారం ఐటిడిఏ ప్రాంగణంలో బిసంఘం జిల్లా అధ్యక్షురాలు గడ్డం భారతి అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం పీఓ, ఐటిడిఏ కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్‌బి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లకు వేతనాలు ఇస్తున్నారని, కానీ ఐటిడిఏ పాఠశాలల్లో మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. వంట కార్మికులతోనే స్కావెంజర్ పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి స్కావెంజర్ కు రూ.10,000 వేతనం చెల్లించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే బిసెప్టెంబర్ 1 నుండిబి వంట పనులు మాత్రమే చేస్తామని, ఇతర పనులు చేయబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోరెడ్డి ప్రమీల, పూలక్క, రమ, పద్మ, సమ్మయ్య, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# బిములుగు నియోజకవర్గంలో 2.09 లక్షల ఓటర్లు

**- ముసాయిదా జాబితా విడుదల**

**- సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలకు అవకాశం**

**- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ వాసుదేవరావు.**



ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రత్యేక సమగ్ర సవరణ2026 కార్యక్రమంలో భాగంగా 109–ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. 109–ములుగు నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో 1,01,964 మంది పురుషులు, 1,07,143 మంది మహిళలు, 21 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని వివరించారు. ప్రతి ఓటరూ జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అర్హులైన వారి పేరు లేకపోతే లేదా వివరాల్లో తప్పులు ఉంటే సెప్టెంబర్ 16వ తేదీ వరకు దావాలు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. కొత్త ఓటు నమోదుకు ఫారం–6, పేరు తొలగింపుకు ఫారం–7, వివరాల సవరణ/చిరునామా మార్పునకు బిఫారం–8 ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత బిబీఎల్‌ఓబి కు నేరుగా గానీ, ఈసీఐనెట్ యాప్ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ సమర్పించవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ములుగు ఆర్డీవో కార్యాలయం, అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా చూడటమే లక్ష్యమని అన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలి

**- అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి**



ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 28 దరఖాస్తులు అందాయి. వాటిలో భూ సమస్యలకు 03, ఇందిరమ్మ ఇండ్లకు 05, పెన్షన్లకు 07, ఇతర శాఖలకు 13 దరఖాస్తులు ఉన్నాయి. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి సమస్యను నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్‌బి, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు



ములుగు, ఆగస్టు 17:విజన్ ఆంధ్ర ప్రతినిధి: కార్తీక మాసంలోని శుద్ధ చతుర్థిని నాగుల చవితిగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సర్పదేవతలను పూజించే ఈ పవిత్ర రోజున గ్రామాల్లోని నాగమ్మ తల్లి ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. నాగుల చవితి సందర్భంగా గ్రామంలోని నాగమ్మ తల్లి ఆలయంలో ఆలయ పూజారి పొడిశెట్టి శేషు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని నాగదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

***నాగుల చవితి ప్రత్యేకత :*** ఈ సందర్భంగా ఆలయ పూజారి పొడిశెట్టి శేషు మాట్లాడుతూ, నాగుపామును సర్పరాజుగా, భూమికి రక్షకుడిగా మన పూర్వీకులు పూజించేవారని తెలిపారు. రైతుల పంటలను నాశనం చేసే ఎలుకలను నాగుపాములు తినడం వల్ల వ్యవసాయ పరంగా కూడా వాటికి ప్రాధాన్యత ఉందన్నారు. నాగుల చవితి రోజున నాగదేవతను పూజించడం ద్వారా సంతానం, ఆయురారోగ్యాలు కలుగుతాయని, సర్పదోష నివారణకు పూజలు విశేష ఫలితాలను ఇస్తాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో భాగంగా నాగదేవత విగ్రహానికి పసుపు, కుంకుమ, పాలు, పూలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పుట్టల వద్ద పాలు పోసి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు కొత్త చీరలు ధరించి నాగమ్మ తల్లికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. గ్రామ ప్రజలకు శాంతి, సుభిక్షం కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు, చిన్నారులు పాల్గొని నాగదేవతను దర్శించుకున్నారు. నాగుల చవితి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది.

# బస్సు యాత్ర స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల హక్కులకై పోరాటం

**- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ గౌడ్**




ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర చైతన్య బస్సు యాత్రలో భాగంగా సోమవారం ములుగు జిల్లాకు చేరుకున్నారు. డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుండి రైతు వేదిక వరకు ర్యాలీ నిర్వహించి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి రమణ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 20 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఏరియాలో రద్దైన సొసైటీలను పునరుద్ధరించాలని, ములుగులో సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు చేయాలని జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బస్సు యాత్ర స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండబోయిన రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ చౌరస్తాలో బస్ షెల్టర్ ప్రయాణికుల ఇక్కట్లు

**- భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బస్టాండ్ కరువు**

**- ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం.. పట్టించుకోని అధికారులు**



భూపాలపల్లి జిల్లా 17 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : భూపాలపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా ప్రజల ప్రధాన సమస్యల్లో ఒకటైన బస్టాండ్ నిర్మాణం మాత్రం ఇంకా పరిష్కారం కాలేదు. జిల్లా నలుమూలల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు భూపాలపల్లికి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, వారికి సక్రమమైన బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర బస్సులు నిర్ణీత బస్టాండ్ లేకపోవడంతో ప్రధాన రహదారుల వెంట, కూడళ్ల వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం జరుగుతోంది. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండాకాలంలో మండుటెండలో, వర్షాకాలంలో వర్షంలో నిలబడాల్సి వస్తుండటంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ప్రాథమిక వసతులు కరువు బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు కనీస వసతులు కూడా అందుబాటులో లేవు. కూర్చునేందుకు బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయాణికుల కోసం షెడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూసే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర ప్రయాణాల కోసం వచ్చే ప్రజలు ఎక్కడ నిలబడాలో తెలియని పరిస్థితి నెలకొంది.

**- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు**

బస్సులు రహదారులపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం వల్ల ప్రధాన రహదారులపై తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఒకే ప్రాంతంలో నిలిచిపోవడంతో ప్రమాదాల ముప్పు కూడా పొంచి ఉంది. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

**- జిల్లా కేంద్రానికి బస్టాండ్ ఎప్పుడు?**

జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లిలో అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు పెరుగుతున్నాయి. దీంతో నిత్యం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భూపాలపల్లికి వస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన జిల్లా కేంద్రంలో ఇప్పటికీ పూర్తిస్థాయి బస్టాండ్ లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.హామీలు అమలయ్యేది ఎప్పుడు?బస్టాండ్ నిర్మాణంపై గతంలో పలుమార్లు చర్చలు, హామీలు వచ్చినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి అనువైన స్థలాన్ని గుర్తించి ఆధునిక సౌకర్యాలతో బస్టాండ్ నిర్మించాలని కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భూపాలపల్లి జిల్లా కేంద్రానికి పూర్తిస్థాయి బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బస్టాండ్ నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల కష్టాలు తీరడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# బిరైస్ మిల్లర్ల సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

**- బాదం ప్రవీణ్ నేతృత్వంలో కీలక డిమాండ్లు**



ములుగు ఆగస్టు 16 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఆదివారం ముఖ్యమంత్రి ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఐ డి ఓ సి ప్రారంభోత్సవ అనంతరం ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ సీఎంను కలిసి తమ సమస్యలను వినతిపత్ర రూపంలో తెలియజేశారు . రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకంలో భాగస్వాములైన రైస్ మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.

***1. ప్రధానంగా ధాన్యం దిగుమతిలో భారీ నష్టాలు .....***

60 రోజుల వరకు ధాన్యం దిగుమతి చేసుకుంటే వెయిట్ లాస్ తో పాటు 10% నష్టం వస్తుందని, డ్యామేజ్ డి-కలర్ కోసం క్వింటాల్ కు రూ.600 నుండి రూ.750 వరకు అదనపు ఖర్చు అవుతుందని తెలిపారు. 90 రోజులు దాటితే బియ్యం రికవరీ 67% నుండి 60–64% కు పడిపోతుందని, దీనివల్ల మిల్లర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

***2. బిమిల్లింగ్ ఛార్జీలు పెంపు అవసరం***

గత 20 ఏళ్లుగా క్వింటాల్ ధాన్యానికి రూ.20 మాత్రమే చెల్లిస్తున్నారని, కానీ కరెంట్ చార్జీలు, లేబర్ ఖర్చులు, మెషినరీ మెయింటెనెన్స్ భారీగా పెరిగాయని పేర్కొన్నారు. 50 హెచ్పి నుండి 200 హెచ్పి వరకు మోటార్లకు కరెంట్ బిల్లులు అధికంగా ఉన్నాయని, కనీసం క్వింటాల్ కు రూ.150 కు పెంచాలని కోరారు.

***3. బిపాత గన్నీ సంచుల భారం తగ్గించాలి***

ప్రస్తుతం ప్రభుత్వం పాత గన్నీ సంచులకు రూ.28 నుండి రూ.35 వరకు వసూలు చేస్తుందని, అదే మార్కెట్లో రూ.10 నుండి రూ.15కే లభిస్తుందని తెలిపారు. సీజన్ కు కనీసం 20% పాత గన్నీల భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

***4. బిగోదాముల కొరత***

జిల్లాలో తగినన్ని గోదాములు లేకపోవడంతో ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, అద్దెల భారం పెరుగుతుందని, దీనివల్ల ప్రభుత్వానికే అదనపు భారం పడుతుందని అన్నారు. కొత్త గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

***5. ఎఫ్ సి ఐ నిబంధనల్లో సడలింపు***

వర్షాలు, తడి కారణంగా వచ్చే బియ్యాన్ని ఎఫ్ సి ఐ తిరస్కరిస్తుందని, అటువంటి బియ్యాన్ని ఎగుమతికి అనుమతించాలని, లేదా ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరారు. రైస్ పరిశ్రమను ఆదుకోవాలి, సన్న బియ్యం పథకం విజయవంతం కావాలంటే మిల్లర్ల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందని బాదం ప్రవీణ్ అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైస్ పరిశ్రమను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గురిజాల సహోదర్ రెడ్డి, ట్రెజరర్ ఎలగందుల మోహన్ తో పాటు పలువురు మిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

**- హెల్ప్‌డెస్క్ ఏర్పాటు, తక్షణ స్పందనకు మంత్రి సీతక్క ఆదేశం**



ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం బిగోవిందరావుపేట మండల కేంద్రంలోబి నిర్వహించిన మండల ప్రజావాణి కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ లో స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపి వాటి పురోగతిని దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు. బిఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌బి ఏర్పాటు చేయాలని, దరఖాస్తుదారుల సెల్ నంబర్లు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి పట్టే సమయాన్ని ముందే చెప్పడంతో పాటు, నిర్ణీత గడువులో పరిష్కారం కాకపోతే కారణం కూడా తెలపాలని స్పష్టం చేశారు. అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని ఆదేశించారు. ఈ నెల 31లోగాబి ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, గీత, నేత కార్మికులు, తలసేమియా బాధితుల పింఛన్ దరఖాస్తులను పూర్తిగా స్వీకరించాలని ఎంపీడీఓలు, తహసీల్దార్లకు సూచించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, తండాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి, ఎస్టీ గూడేల్లో మౌలిక సదుపాయాలకు రూ.50 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిగ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, తహసిల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్‌బి తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా ఉద్యమ త్యాగాలను గుర్తించండి

**- ములుగు ఉద్యమకారులు ......**

**- మండలాల ఏర్పాటుపై ప్రభుత్వానికి విజ్ఞప్తి......**





ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా ఆవిర్భావం వెనుక ఎన్నో త్యాగాలు, కేసులు, లాఠీదెబ్బలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం గుర్తించాలని జిల్లా ఉద్యమకారులు కోరుతున్నారు. 2016 విజయదశమి రోజున అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించిన కొత్త జిల్లాల జాబితాలో ములుగు పేరు లేకపోవడంతో ఉద్యమం ప్రారంభమైంది. ఆనాడు అందరు నాయకులు వెనక్కి తగ్గినా "మలిదశ ఉద్యమం" పేరిట కొందరు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని ఉద్యమకారులు గుర్తు చేశారు. ఈ ఉద్యమంలో బిఏబీఎన్ వెంకట కృష్ణ, రేవంత్ రెడ్డి, కోదండరాం, రామచంద్రరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కబి, విమలక్క, తదితర నాయకుల మద్దతు ఉందని తెలిపారు. విలేకరుల పాదయాత్ర, 9 మండలాల జీఏసీల కృషి, హైదరాబాద్ ఇందిరా పార్కులో డిసెంబర్ 15, 2016 న జరిగిన ధర్నా వల్లనే ప్రభుత్వం మెడలు వంచి చివరికి ములుగును జిల్లాగా ప్రకటించిందని అన్నారు. "శంఖారావం" పేరిట 7 పాటలతో ప్రజల్లో చైతన్యం నింపామని, సొంత డబ్బులు వేసుకొని ఉద్యమం నడిపామని చెప్పారు. ఆనాటి మంత్రి చందూలాల్ కొంతమంది రిపోర్టర్లను బెదిరించినా ఉద్యమం ఆపలేదని గుర్తు చేశారు.

***- ఉద్యమకారుల ఆవేదన***

అయితే ఇన్ని త్యాగాలు చేసిన అసలు ఉద్యమకారులను ఇప్పుడు మరిచారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "స్వాతంత్ర్య దినోత్సవం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, ఫిబ్రవరి 17 జిల్లా ఆవిర్భావ దినోత్సవాల్లో మమ్మల్ని గుర్తుకు తెచ్చుకోవడం లేదు. జిల్లా కోసం లాఠీ దెబ్బలు తిన్న వాళ్లం మేము. ఒక్కరో ఇద్దరో చేస్తే వచ్చిన ఉద్యమమా ఇది? జేఏసీ ప్రకటించింది ఎవరు?" అని మంత్రి సీతక్క ను ప్రశ్నించారు. జిల్లా ఉద్యమకారుల పేరు మీద ఒక పైలాన్ ఏర్పాటు చేసి గుర్తింపు ఇవ్వాలని కోరారు.

***- ప్రభుత్వానికి కొత్త డిమాండ్లు***

ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు.

1. ఇప్పటికే మల్లంపల్లిని మండలం చేసినట్లే, రాజుపేట ను కూడా కొత్త మండలంగా ప్రకటించాలి
2. నూగురువెంకటాపూర్ లో మూతపడి ఉన్న సబ్ జైల్ ను పున:ప్రారంభించాలి
3. ములుగు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల నిర్మాణం చేపట్టాలి
4. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పడిన బిమున్సిపాలిటీకి అధిక నిధులు మంజూరు చేయాలి "ప్రతిపక్షంలో ఉండి చేయలేకపోయిన అభివృద్ధిని అంతా మీ హయాంలో చేయాలని మా ఆకాంక్ష" అని ఉద్యమకారులు అన్నారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా జేఏసీ కన్వీనర్ గంద్ర కోట కుమార్, జేఏసీ నాయకులు మసర గాని వినయ్ కుమార్ , ఎండి అహ్మద్ పాష, బండారి హరినాథం, సిరికొండ బలరాం, పోరిక గోవింద నాయక్, ఆల్లె శోభన్, పాడియ చంటి, శానబోయిన అశోక్, శీలవంతుల రవీంద్ర చారి, యనగందుల శంకర్, గంగిశెట్టి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు...

# నత్తనడకన ములుగు బస్టాండ్ పనులు

**- సిపిఎం ఆందోళన హెచ్చరిక**



ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి :జిల్లా కేంద్రంలోని నూతన బస్టాండ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని బిసిపిఎం మండల కార్యదర్శి ఎం.డి గఫూర్ పాషా అన్నారు. సోమవారం బస్టాండ్ ను పరిశీలించిన ఆయన, మేడారం జాతరకు ముందే పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటికీ సగం కూడా కాలేదని విమర్శించారు. టాయిలెట్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# కేటీఆర్ పిలుపు మేరకు ములుగు లో ధర్నా రాస్తారోకో నిరసనలు



ములుగు ఆగస్టు 17, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మాజీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండించారు. ప్రధానంగా బికల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పెండింగ్ నిధులుబి వెంటనే విడుదల చేయాలని, బిరైతు బీమా పథకంబి తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని రమేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిమాజీ పట్టణ అధ్యక్షుడు చన్న విజయ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, కోయిల మహేష్, ఆకుతోట చంద్రమౌళి, మహిళా నేతలు అనూష సాగర్, రేసోజు పద్మబి తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్ పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనను జయప్రదం చేద్దాం

***గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో ప్రచార పోస్టర్ ఆవిష్కరణ***



కాప్రా/ఆగష్టు 17( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్–మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఈ.సీ.ఐ.ఎల్ చౌరస్తాలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌడ జే.ఏ.సీ రాష్ట్ర కో–కన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ. ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలిరావాలని, ఉదయం స్థానికంగా జయంతి ఉత్సవాలు ముగించుకుని సాయంత్రానికి ర్యాలీగా ట్యాంక్ బండ్ చేరుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిష్ఠాపనకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు పాండల శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ 370 ఏళ్ల క్రితమే మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పాపన్న బహుజన రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు. రాష్ట్ర నాయకుడు తాళ్ల వెంకటేష్ గౌడ్ ఆయనను భావితరాలకు స్ఫూర్తిదాతగా అభివర్ణించారు. ఈనెల 18న ఈసీఐఎల్‌లో పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల ఆనంద్ గౌడ్ కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, శోభన్ బాబు, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రీఫేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి



మల్కాజిగిరి, ఆగస్ట్ 17,(విజన్ ఆంధ్ర): మౌలాలి లోని కద్ మే రసూల్ పహాడ్‌లో త్రీఫేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఆదివారం వారు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికి ఆయన, తక్షణమే స్పందించారు. సమస్యలను పరిష్కరించి విద్యుత్ సరఫరా చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎండీ ఉస్మాన్, వంశీ ముదిరాజ్, జోహైబుద్దీన్, అఫ్రోజ్, గఫూర్, ముఖీ తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో ఎద్దు మృతి...



లింగాపూర్ ఆగస్టు 17(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ రఘునాథ్ గల ఎద్దును రోజువారి వ్యవసాయ పనులను ముగించుకొని చేను శివారులో కట్టేసి వేరే పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో ఎద్దు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది ఆ వ్యక్తి తీవ్ర దుఃఖ సముద్రంలో మునిగిపోయి కన్నీరు మున్నీరయ్యారు . ఎద్దు సుమారు వేల 40 వెలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అధికారులు తనకు నష్టపరిహారం అందించాలని ఆ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

**-పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి**

**-మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**



హైదరాబాద్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు.

**- కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలి**

రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

**- జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు**

అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**- అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు**

సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు.

**- ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు.

**- రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్**

సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

# “పచ్చదనం కోసం మొక్క.. భద్రత కోసం 112..

**- మొక్కకు నీరు.. భవిష్యత్తుకు ఊపిరి! 'నా మొక్క నా బాధ్యత'**

**- కొత్త విద్యార్థులకు పచ్చని స్వాగతం.. 'నా మొక్క.. నా బాధ్యత'**

**- విజన్ ఆంధ్ర కొత్తగూడెం జిల్లా స్టాఫర్ ఉమా కాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం**









**కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 18(విజన్ ఆంధ్ర)**
విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించడంతో పాటు, పాఠశాల ప్రాంగణాలను పచ్చదనంతో నింపాలనే ఉద్దేశంతో 'నా మొక్క నా బాధ్యత' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విజన్ ఆంధ్ర కొత్తగూడెం జిల్లా స్టాఫర్ ఉమా కాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నేతాజీ రామవరం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షి టీం ఎస్ ఐ రమాదేవి హాజరై విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత భద్రత, బాలికల రక్షణ, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.కొత్తగా పాఠశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు పుస్తకాలతో పాటు ప్రకృతితో కూడా అనుబంధం ఏర్పడేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని తన బాధ్యతగా భావించి సంరక్షించేలా ప్రోత్సహించారు. విద్యార్థులు స్వయంగా మొక్కలు నాటి వాటికి నీరు పోసి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు.

### మొక్కను నాటడం అంటే భవిష్యత్తును నాటడమే

ఈ సందర్భంగా ముఖ్య అతిథి షి టీం ఎస్ ఐ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతను వివరించారు. “పిల్లలూ.. మొక్కను నాటడం అంటే కేవలం ఒక మొక్కను భూమిలో నాటడం కాదు.. మన భవిష్యత్తును నాటడం. ఈరోజు మనం నాటే చిన్న మొక్క రేపు పెద్ద చెట్టుగా ఎదిగి ఎన్నో తరాలకు నీడనిస్తుంది. స్వచ్ఛమైన గాలిని అందిస్తుంది. పర్యావరణాన్ని కాపాడుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని మీ స్నేహితుడిలా భావించి సంరక్షించాలి” అని సూచించారు.మొక్క నాటిన తర్వాత దానిని మరిచిపోకుండా ప్రతిరోజూ నీరు పోయాలని, దాని ఎదుగుదలను గమనించాలని చెప్పారు. తాము పెరుగుతున్నట్లుగానే తమ చేతులతో నాటిన మొక్క కూడా పెరుగుతుండటం విద్యార్థులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు.ప్రతి విద్యార్థి తన ఇంటి వద్ద, పాఠశాలలో లేదా అందుబాటులో ఉన్న ప్రదేశంలో కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే అలవాటు చేసుకోవాలని సూచించారు. పచ్చదనం పెరిగితే పర్యావరణం ఆరోగ్యంగా ఉంటుందని, పర్యావరణం ఆరోగ్యంగా ఉంటే మన సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు.

### స్త్రీ లిబాలికల భద్రతపై ప్రత్యేక అవగాహన

పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా రమాదేవి అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నారులు, బాలికలు ఎదుర్కొనే సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యార్థులకు సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ గురించి సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. తమకు అసౌకర్యంగా అనిపించే స్పర్శను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎవరైనా ఇబ్బంది పెట్టినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, బెదిరించినా, వెంటపడినా లేదా తమకు భయం కలిగించే విధంగా ప్రవర్తించినా వెంటనే నమ్మకమైన పెద్దలకు విషయం చెప్పాలని సూచించారు.“సమస్యను మనసులో పెట్టుకుని మౌనంగా ఉండకండి. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వండి. మీ భద్రత మీ హక్కు. మీకు ఎదురయ్యే సమస్యను చెప్పడానికి ఎలాంటి భయం లేదా సంకోచం అవసరం లేదు” అని విద్యార్థులకు ధైర్యం చెప్పారు.పిల్లల భద్రత కోసం పోలీస్ శాఖ తరపున షి టీమ్స్, ఎ హెచ్ టి యు వంటి విభాగాలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఏదైనా సమస్యను ఎదుర్కొంటే సంబంధిత పెద్దలకు సమాచారం అందించి అవసరమైన సహాయం పొందాలని సూచించారు.

### ఆపదలో ఉంటే 112కు కాల్ చేయండి

అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందేందుకు డయల్ 112 సేవను ఉపయోగించుకోవాలని రమాదేవి విద్యార్థులకు వివరించారు.రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, మహిళలు లేదా బాలికలపై వేధింపులు జరిగినప్పుడు, గొడవలు, బెదిరింపులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే 112కు ఫోన్ చేయాలని సూచించారు.“ఆపదలో ఉంటే భయపడొద్దు.. 112కు కాల్ చేయండి. సమయానికి సమాచారం అందిస్తే పోలీసులు సత్వరమే స్పందించి అవసరమైన సహాయం అందించే అవకాశం ఉంటుంది” అని తెలిపారు.విద్యార్థులు తమ చుట్టూ ఉన్నవారి భద్రత పట్ల కూడా బాధ్యతగా వ్యవహరించాలని, ఎవరైనా ప్రమాదంలో ఉన్నట్లు కనిపిస్తే వెంటనే పెద్దలకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

### మంచి విద్యార్థులుగా.. మంచి పౌరులుగా ఎదగాలి

విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని రమాదేవి సూచించారు.“మీరు బాగా చదువుకోవాలి. ఉపాధ్యాయులను గౌరవించాలి. తల్లిదండ్రుల మాట వినాలి. పాఠశాల నియమాలను పాటించాలి. మీ తోటి విద్యార్థులను గౌరవించాలి. ప్రకృతిని ప్రేమించాలి. చెట్లను కాపాడాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన మంచి పౌరులుగా ఎదగాలి” అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా పంచుకోవాలని, ఏ సమస్యనైనా ఒంటరిగా ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా పెద్దల సహాయం తీసుకోవాలని తెలిపారు.

### ప్రతి విద్యార్థి ఒక మొక్క.. ప్రతి మొక్క ఒక బాధ్యత

ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరిస్తూ విజన్ ఆంధ్ర కొత్తగూడెం జిల్లా స్టాఫర్ ఉమా కాంత్ మాట్లాడుతూ పాఠశాలలో కొత్తగా చేరుతున్న ప్రతి విద్యార్థికి పుస్తకాలతో పాటు ప్రకృతితో అనుబంధం ఏర్పడాలనే ఉద్దేశంతో 'నా మొక్క నా బాధ్యత' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.“ఒక విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని తన బాధ్యతగా భావించి పెంచితే.. ఆ మొక్కతో పాటు ఆ విద్యార్థిలో కూడా బాధ్యతా భావం పెరుగుతుంది. మొక్కను నాటడం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, దాని సంరక్షణను నిరంతరం కొనసాగించే ఉద్యమంగా మార్చాలన్నదే మా లక్ష్యం” అని అన్నారు.పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థి తన చేతులతో ఒక మొక్కను నాటి, దాని ఎదుగుదలను గమనించాలని కోరారు. భవిష్యత్తులో ఆ విద్యార్థి పాఠశాలను విడిచి వెళ్లిపోయినా, తాను నాటిన మొక్క మాత్రం అక్కడే పెరిగి మరెందరికో ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు.పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క ప్రభుత్వానికో, ఒక్క సంస్థకో సంబంధించిన బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉమా కాంత్ తెలిపారు. చిన్నారుల్లోనే ఈ భావనను పెంపొందిస్తే భవిష్యత్తులో పచ్చదనం పట్ల మరింత బాధ్యత కలిగిన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు.

### పాఠశాల యాజమాన్యానికి అభినందనలు

'నా మొక్క నా బాధ్యత' కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించేందుకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, షి టీం ఎస్ ఐ రమా దేవి కి ఉమా కాంత్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి రెండు ముఖ్యమైన అంశాలను ఒకే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చేరువ చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

### విద్యార్థులతో ప్రతిజ్ఞ

కార్యక్రమం అనంతరం విద్యార్థులతో 'నా మొక్క నా బాధ్యత' ప్రతిజ్ఞ చేయించారు. తాము నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షిస్తామని, మొక్కలకు నీరు పోస్తామని, వాటిని నష్టం కలగకుండా కాపాడుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.అలాగే పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, చెట్లను కాపాడటం, ప్రకృతిని ప్రేమించడం, ఇతరులను కూడా మొక్కలు నాటేలా ప్రోత్సహించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. తమ పేర్లతో మొక్కలను అనుసంధానం చేసుకుని వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుంటామని తెలిపారు.

**కార్యక్రమ నినాదం**

“ఒక్క విద్యార్థి ఒక్క మొక్క”
“ఒక్క మొక్క ఒక భవిష్యత్తు”
“నా మొక్క నా బాధ్యత”
“పచ్చని పాఠశాల ఆరోగ్యకరమైన సమాజం”

పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల భద్రతపై అవగాహన కల్పించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా నిలిచింది. పాఠశాల ప్రాంగణంలో నాటిన ప్రతి మొక్క విద్యార్థుల బాధ్యతకు ప్రతీకగా నిలవాలని, ఈ కార్యక్రమం ద్వారా ప్రారంభమైన పచ్చదనం ఉద్యమం మరింత విస్తరించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, షి టీం సిబ్బంది, విజన్ ఆంధ్ర జిల్లా ఫోటోగ్రాఫర్ కవటం శ్రీనివాస్ , నరసింహ, మోహన ప్రియ తదితరులు పాల్గొన్నారు

# వట్టివాగు ప్రాజెక్ట్ నీళ్లు విడుదల చేయాలని రైతులు చేస్తున్న ధర్నాకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ...

**- జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు,**
**ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు..**

**- ఆర్డీవో రైతులతో మాట్లాడి నీటిని విడుదల**
**చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించిన రైతులు....**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి,ఆగస్టు17,( విజన్ ఆంధ్ర ) : కొమురం భీం అసిఫాబాద్ జిల్లా అసిఫాబాద్, రెబ్బెన మండలంలోని రైతులకు సాగునీరు అందించాలని ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బూరుగుడా సమీపంలో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు వెంటనే ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు చేస్తున్న ఆందోళనకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వట్టివాగు ప్రాజెక్టు నిండు కుండల పడుతుంది ఎల్ నినో సాకుతో రైతులకు సాగు నీరు అందించవద్దని రాష్ట్ర ప్రభుత్వం ఎలా చెబుతుంది, సాగునీరు అందకపోతే రైతులు పంటలు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అధికారులు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి ఎండతో ఇబ్బంది పడిన ప్రయాణికులు, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎల్ నినో సాకుతో రైతులకు సాగునీరు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. వర్షాలు కురిసి వరద నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. రైతులకు నీరు అందించకపోతే నష్టపోయిన ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు,ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల రైతులు,బి ఆర్ స్ నాయకులు అలీబీన్ హైమద్, సంజీవ్, జీవన్, శ్రీనివాస్, నవీన్ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండలాల్లో 'ప్రజావాణి'!! ప్రజల వద్దకే పాలన

## వ్యయప్రయాసలు లేని సత్వర పరిష్కారం

**-సవాళ్లనూ అధిగమించాల్సిందే**

**-భవనాల కొరత మౌలికవసతులలేమి**

**విజన్ ఆంధ్ర స్పెషల్ స్టోరీ**
**హైదరాబాద్, ఆగస్టు 17:**
రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలకే పరిమితమైన 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించింది. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 620 మండలాల్లో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం చేశారు. ఈ నిర్ణయంపై క్షేత్రస్థాయి విశ్లేషణ:

### సానుకూల అంశాలు

**- వ్యయప్రయాసలు లేని సత్వర పరిష్కారం**

రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ప్రజావాణికి వస్తున్న దరఖాస్తుల్లో దాదాపు 70 శాతం మండల స్థాయి సమస్యలే ఉంటున్నాయి. తాజా నిర్ణయంతో సామాన్య ప్రజలు హైదరాబాద్‌కో, జిల్లా కేంద్రాలకో వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వినతులు సమర్పించే వెసులుబాటు కలుగుతుంది.

**- శాఖల మధ్య సమన్వయం**

ఎంపీడీవో, తహసీల్దార్‌లతో పాటు వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్, సంక్షేమ, పోలీస్ తదితర కీలక శాఖల అధికారులంతా ఒకే వేదికపైకి రావడం వల్ల దరఖాస్తుదారులకు సంబంధిత శాఖలను వెతుక్కునే శ్రమ తప్పుతుంది.

**- పారదర్శకత ఆన్‌లైన్ ట్రాకింగ్**

ప్రతి దరఖాస్తును పోర్టల్‌లో నమోదు చేసి, కంప్యూటర్ ఆధారిత రిజిస్ట్రేషన్ నంబర్ ఇస్తారు. దీని ద్వారా ప్రజలు తమ అర్జీ ఏ దశలో ఉందో మొబైల్ లేదా ఇంటర్నెట్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునే అవకాశం లభిస్తుంది.

**- ప్రజల చెంతకే పాలన... మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి శ్రీకారం. మౌలిక వసతుల లేమి, సాంకేతిక సవాళ్లను అధిగమిస్తేనే సామాన్యుడికి నిజమైన భరోసా!!**




**- పకడ్బందీ ఏర్పాట్లు**

మండల స్థాయి నిర్వహణకు ఎంపీడీవోలకు ప్రజాభవన్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్, స్కానర్, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించడం మరియు గ్రామాల్లో చాటింపు ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం ప్రశంసనీయం.




### సవాళ్లు & ఆందోళనలు

**- భవనాల కొరత మౌలిక వసతుల లేమి**

రాష్ట్రంలోని 152 మండల కేంద్రాల్లో ఇప్పటికీ సొంత ప్రభుత్వ కార్యాలయ భవనాలు లేవు. అద్దె భవనాల్లో ప్రజావాణి నిర్వహిస్తుండటంతో, వచ్చే వందలాది మంది ప్రజలకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించడం పెద్ద సవాలుగా మారనుంది.

**- సాంకేతిక అడ్డంకులు**

గ్రామీణ/మారుమూల మండలాల్లో తరచూ తలెత్తే నెట్‌వర్క్ సమస్యలు, సర్వర్ డౌన్ సమస్యల వల్ల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు మందగించి, ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి రావచ్చు.
పరిష్కారాల కంటే దరఖాస్తులకే ప్రాధాన్యమా? అర్జీలు తీసుకోవడం, రిజిస్ట్రేషన్ నంబర్లు ఇవ్వడం వరకే కాకుండా... నిర్దిష్ట కాలవ్యవధిలో సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. గతంలో జిల్లా స్థాయిలో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

**- అధికారుల హాజరుపై పర్యవేక్షణ**

జాబితా ప్రకారం అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం క్షేత్రస్థాయికి తప్పక హాజరవుతారా లేదా కింది స్థాయి సిబ్బందిని పంపుతారా అన్నది నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వ ఉద్దేశం పరంగా ఎంతో ఆదర్శవంతమైనది. అయితే కేవలం అర్జీల స్వీకరణతో సరిపెట్టకుండా, నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపినప్పుడే ఈ వ్యవస్థ ప్రజలకు నిజమైన భరోసాగా మారుతుంది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

EDITED, PRINTED, PUBLISHED, AND OWNED BY J. NARENDER. PRINTED AT: SREE SESHASAI ENTERPRISES, 3-88, CHANDRA THEATRE MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151 AT J.N. PUBLICATION, 76-6-01, BHATS-ING ROAD, CHAITANYA APTS, NEAR SWATHI CENTER, BHAVANIPURAM, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH – 521137. RNI NO.: APTEL/26/A0313 EDITOR: J. NARENDER CELL NO.: 9440897445 EMAIL: visionandhra1999@gmail.com